/manamnews
www.manamnews.com

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..


తిరుపతి | శుక్రవారం • 17-3-2023 • సంపుటి:7 • సంచిక:72 • పేజీలు:8 • వెల:రూ.5

AMARAVATHI | ANANTHAPURAM | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHBUBNAGAR | WARANGAL | KHAMMAM

ఫాల్గుణమాసం, శుక్రవారం, తిథి: దశమి, మ.2.07 వరకు తదుపరి ఏకాదశి, నక్షత్రం: ఉత్తరాషాఢ, ఉ.4.47 నుంచి రేపు ఉ.2.46 వరకు, వర్జ్యం: ఉ.6.23-7.50 వరకు, దుర్ముహూర్తం: మ.12.00-12.48 వరకు, రాహుకాలం: ఉ.10.55-12.24 వరకు

## కరోనా విజృంభించొచ్చు..

### తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలకు కేంద్రం లేఖ



న్యూఢిల్లీ, మార్చి 16: భారత్‌లో మరోసారి కొత్త వేరియెంట్ రూపేణా కరోనా విజృంభించే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే కేసుల్లో ఒక్కసారిగా పెరుగుదల కనిపించింది. మరోవైపు ఫ్లూ కేసులు గణనీయంగా నమోదు అవుతున్నాయి. ఈ తరుణంలో తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలకు కేంద్రం లేఖ రాసింది. హఠాత్తుగా కరోనా కేసులు పెరిగే అవకాశం ఉన్నందున.. అప్రమత్తంగా ఉండాలని, నియంత్రణ మీద దృష్టిసారించాలని ఆ లేఖలో పేర్కొంది. మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు బుధవారం కేంద్ర ఆరోగ్య కార్యదర్శి లేఖలు ..మిగతా 2లో



2

## ఎన్నారైలు విదేశాల్లోనే ఓటు వేయొచ్చు..

### వారి కోసం ప్రత్యేక పోస్టల్ బ్యాలెట్



## అదే ప్రతిష్టంభన..

### పట్టువీడని అధికార, ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ, మార్చి 16: అదానీ వ్యవహారంపై ప్రతిష్టంభన తొలగడం లేదు. ఇదే అంశంపై పార్లమెంట్ ఉభయసభల్లోనూ అధికార, ప్రతిపక్షాలు విమర్శలు ప్రతివిమర్శలు చేసుకున్నాయి. అదానీ వ్యవహారంపై విచారణ చేపట్టేందుకు సంయుక్త పార్లమెంటరీ సంఘం ఏర్పాటు చేయాలని ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టగా.. లండన్‌లో చేసిన వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ క్షమాపణలు చేయాలని అధికార భాజపా డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ఎలాంటి చర్చోపచర్చలు లేకుండా ఉభయసభలు రేపటికి వాయిదా పడ్డాయి. మరోవైపు అదానీకి అధికార భాజపా వత్తాసు పలుకుతోందంటూ ప్రతిపక్ష సభ్యులు పార్లమెంట్ ఎదుట మానవహారంగా ఏర్పడ్డారు. రాజ్యసభలో ..మిగతా 2లో




### రెవెన్యూ వ్యయం
### రూ.2,28,540 కోట్లు

### మూలధన వ్యయం
### రూ.31,061 కోట్లు

సంక్షేమ పథకాలకు పెద్దపీట

కరోనా సంక్షోభ సమయంలో ఆటుపోట్లను అధిగమించాం

సుస్థిర అభివృద్ధి, సుపరిపాలనపై దృష్టి సారించాం

రైతుల ఆదాయం పెంచడమే మా ప్రభుత్వ లక్ష్యం

ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

అమరావతి, మార్చి 16 (మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రూ.2.79 లక్షల కోట్ల అంచనాలతో బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పేదలకు అండగా నిలిచే సంక్షేమ పథకాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఏపీ వార్షిక బడ్జెట్ రూ. 2లక్షల 79వేల 279 కోట్లు కాగా.. రెవెన్యూ వ్యయం రూ.2,28,540 కోట్లు. మూలధన వ్యయం రూ.31,061కోట్లు. పోతన పద్యంతో, రవీంద్రనాథ్ ఠాగూర్ వ్యాఖ్యలతో తన బడ్జెట్ ప్రసంగాన్ని మొదలుపెట్టారు. ఈ సందర్భంగా బడ్జెట్ రూపకల్పనలో భాగస్వాములైన వారికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కరోనా సంక్షోభ సమయంలో ఆటుపోట్లను అధిగమించామని మంత్రి బుగ్గన అన్నారు. ఈ బడ్జెట్ సుస్థిర అభివృద్ధి, 62శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నట్టు మంత్రి బుగ్గన తెలిపారు. రైతుల ఆదాయం పెంచడంపైనే ..మిగతా 2లో



## దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేయలేదు

### ప్రజాస్వామ్యం పనిచేస్తుంటే.. నాకు మాట్లాడే అవకాశం వస్తుంది

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, మార్చి 16: భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ గడ్డపై చేసిన వ్యాఖ్యలకు పార్లమెంట్ కార్యకలాపాలు నిలిచిపోతున్నాయి. ఆయన క్షమాపణ చెప్పాలని అధికార భాజపా డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలో గురువారం రాహుల్ పార్లమెంట్‌కు వచ్చారు. ఈ వివాదంపై స్పందించేందుకు తనకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు. రాహుల్ మాట్లాడే అవకాశం ..మిగతా 2లో

## సంక్షేమం, విద్యా, వైద్యానికి పెద్ద పీట..



2



## 4.4 లక్షల గృహ నిర్మాణాలు పూర్తి..

మరో రూ.5,600 కోట్లు కేటాయింపు..

2

## మహిళా సాధికారతకు వేల కోట్లు..

2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను మహిళా అభివృద్ధి, పిల్లల సంక్షేమం కోసం 3,951 కోట్ల రూపాయలు

2





## కుప్పకూలిన ఆర్మీ హెలికాప్టర్..

### ఇద్దరు పైలట్లు మృతి

ఇటానగర్, మార్చి 16: భారత సైన్యానికి చెందిన ఓ హెలికాప్టర్ కుప్పకూలింది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని పశ్చిమ కమెంగ్ జిల్లా మండలా పర్వత ప్రాంతంలో గురువారం ఉదయం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు మృతి చెందారు. వారిని లెఫ్టినెంట్ కల్నల్ వీవీబీ రెడ్డి, మేజర్ జయంత్‌గా గుర్తించారు. రోజువారీ విధుల్లో భాగంగా ఇక్కడి సెంగే గ్రామం నుంచి అస్సాంలోని మిసామారీకి వెళ్తుండగా.. మార్గమధ్యలో ఈ ప్రమాదం జరిగినట్లు ..మిగతా 2లో

## నేడు ప్రధానితో సీఎం భేటీ

### రెండు రోజుల పాటు ఢిల్లీ పర్యటన



అమరావతి, మార్చి 16 (మనం న్యూస్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఢిల్లీ చేరుకున్నారు. ఈరోజు(గురువారం) సాయంత్రం గన్నవరం విమానాశ్రయం నుండి ఢిల్లీకి వెళ్లారు. తొలుత తాడేపల్లి నివాసం నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న సీఎం జగన్.. అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లారు. రాత్రి 7.30 గంటల సమయంలో సీఎం జగన్ ఢిల్లీ చేరుకున్నారు. అక్కడి 1 జన్‌పథ్ నివాసంలో బస చేశారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ప్రధాని మోదీ, కేంద్రమంత్రులతో సీఎం జగన్ భేటీ కానున్నట్టు సమాచారం. నేడు ఉదయం 11 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీతో సీఎం వైఎస్ జగన్ సమావేశం కానున్నారు.

## కోర్టు అంటే లెక్కలేదా..?

### దక్షిణ మధ్య రైల్వే జీఎంపై హైకోర్టు ఆగ్రహం..




అమరావతి, మార్చి 16 (మనం న్యూస్): దక్షిణ మధ్య రైల్వే జీఎంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది ఆంధ్రప్రదేశ్ హైకోర్టు.. ఆదేశాలు ఇచ్చినా కోర్టుకు హాజరు కాకపోవడంపై మండిపడ్డింది. రైల్వే జనరల్ మేనేజర్ విజయవాడ డీఆర్‌ఎం కోర్టుకు రావాలని ఆదేశాలు ఇచ్చినా రాకపోవటంతో స్పం దించిన హైకోర్టు.. ఈ వ్యాఖ్యలు చేసింది.. కోర్టు అంటే లెక్కలేనితనమా అని వ్యాఖ్యానించిన న్యాయస్థానం.. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంది.. జీఎం స్థాయి అధికారిని కూడా కోర్టుకు రప్పించక పోతే హైకోర్టు ఎందుకని ప్రశ్నించింది.. బెజవాడ మధురా నగర్ దగ్గర రైల్వే ఆలస్యం వల్ల ఇబ్బందులు పడుతున్నామని దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు ..మిగతా 2లో



## ఎమ్మెల్సీ 'స్థానిక' కోటాలో వైసీపీ గెలుపు..

టీచర్, గ్రాడ్యుయేట్ ఓట్ల లెక్కింపు

శ్రీకాకుళంలో నర్తు రామారావు విజయం

పశ్చిమ గోదావరి, కర్నూలులో వైకాపాదే గెలుపు..

ఉత్తరాంధ్రలో ఫలితానికి 48గంటలు!

2

## ఒంగోలు ఎంపీకి ఈడీ నోటీసులు



న్యూఢిల్లీ, మార్చి 16: ఢిల్లీ మద్యం కుంభకోణంలో వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 18న విచారణకు రావాలని నోటీసులో పేర్కొన్నారు. ఇప్పటికే మాగుంట తనయుడు రాఘవరెడ్డి ఈ కేసులో అరెస్టయి జైలులో ఉన్న విషయం తెలిసిందే. మద్యం కేసులో ఈరోజు అరుణ్ పిళ్లైని కోర్టులో హాజరు పరిచిన అధికారులు.. ఐదు రోజుల పాటు కస్టడీకి కోరారు. ఇతర నిందితులతో కలిపి పిళ్లైని ప్రశ్నించాల్సి ఉందని కోర్టుకు తెలపగా.. 3 రోజుల పాటు కస్టడీకి న్యాయస్థానం అనుమతించింది. కొందరు నిందితులు, ..మిగతా 2లో

## అంకెల గారడీతో మాయ చేశారు

2





2

## 'పరిశ్రమ' హోదాతోనే పర్యాటక వికాసం

రాజ్యసభలో విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి జవాబు

### మంచిమాట

నీ అసూయ ఇతరులను కొంత ఇబ్బంది పెట్టవచ్చునేమో కానీ నిన్ను మాత్రం నిలువునా దహిస్తుంది.

శుభోదయం

## కరోనా విజృంభించొచ్చు..

(మొదటిపేజీ తరువాయి)

రాశారు. టెస్టుల సంఖ్యను పెంచాలని, చికిత్స, ట్రాకింగ్‌తో పాటు వ్యాక్సినేషన్ పైనా దృష్టిసారించాలని ఆరోగ్య శాఖ లేఖల్లో ఆయా రాష్ట్రాలను కోరింది. ఆయా రాష్ట్రాల్లో పరిస్థితుల దృష్ట్యా కేసుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని, కాబట్టి నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించింది ఆరోగ్య శాఖ. ఈ పర్యవేక్షణ క్షేత్ర స్థాయి (గ్రామాలు, మండలాలు, జిల్లాలు) నుంచే కొనసాగాలని, కోవిడ్-19 నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా రాష్ట్రాలకే కేంద్ర ఆరోగ్య శాఖ సూచించింది. ఇదిలా ఉంటే.. గత శనివారం కేంద్ర ఆరోగ్య కార్యదర్శి రాజేష్ భూషణ్ సైతం రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖలు రాశారు. కొన్ని రాష్ట్రాల్లో కేసుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని కోరారాయన. చివరగా.. ఒక్కరోజులో దేశవ్యాప్తంగా నవంబర్ 12వ తేదీన 734 కేసులు నమోదు అయ్యాయి. ఆ తర్వాత.. ఇప్పుడు నాలుగు నెలల తర్వాత బుధవారం 700కి పైగా కొత్త కేసులు వెలుగు చూశాయి. గురువారం ఉదయం కేంద్ర ఆరోగ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం యాక్టివ్ కేసుల సంఖ్య 4 వేల(4,623) పైకి చేరింది. యాక్టివ్ కేసుల శాతం 0.01 శాతంగా ప్రస్తుతానికి ఉండగా, రికవరీ రేటు 98.80 శాతంగా ఉంది.

## ఎన్నారైలు విదేశాల్లోనే ఓటు వేయొచ్చు..

న్యూఢిల్లీ, మార్చి 16: ప్రవాస భారతీయ (ఎన్నారై) ఓటర్ల కోసం ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీబీపీఎస్)ను అమలు చేసే ప్రతిపాదన పరిశీలనలో కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజీజు పేర్కొన్నారు. రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అడిగిన ప్రశ్నకు కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజీజు సమాధానమిస్తూ.. 1 జనవరి 2023 నాటికి ప్రజాప్రాతినిధ్య చట్టం 1950లోని సెక్షన్ 20అ ప్రకారం విదేశాల్లో నివసిస్తున్న 1,15,696 మంది భారతీయ పౌరులు భారతీయ ఓటర్ల జాబితాలో ఓటర్లుగా నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఎన్నారై ఓటర్ల కోసం ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని అమలు చేయడానికి ఎన్నికల ప్రవర్తన నియమాలు 1961ను సవరించే ప్రతిపాదనను భారత ఎన్నికల సంఘం చేపట్టిందని న్యాయ మంత్రి కిరణ్ రిజీజు తెలిపారు. ప్రతిపాదన అమలులో ఉన్న లాజిస్టికల్ సవాళ్లను పరిష్కరించేందుకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో ఈ విషయం చర్చిస్తున్నట్లు చెప్పారు. విదేశీ ఓటర్లు వ్యక్తిగతంగా లేదా ప్రాక్సీ (నామినేటెడ్ ఓటరు) ద్వారా ఓటు వేయడానికి వీలుగా ప్రజాప్రాతినిధ్య (సవరణ) బిల్లు, 2018 పేరుతో భారత ఎన్నికల సంఘం సిఫార్సు చేసిన బిల్లును ఆగస్టు 9, 2018న లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆమోదించినట్లు న్యాయ మంత్రి తెలిపారు. అయితే 16వ లోక్‌సభ రద్దు కారణంగా ఈ బిల్లు కూడా రద్దయిందని పేర్కొన్నారు.

## దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేయలేదు

(మొదటిపేజీ తరువాయి)

లేకుండా నిమిషాల వ్యవధిలో సభ వాయిదా పడింది. ఈ క్రమంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'నేను ఈ రోజు పార్లమెంట్‌కు వెళ్లిన మరునిమిషమే సభ వాయిదా పడింది. నా ఆలోచనలను వెల్లడించేందుకు సభకు వెళ్లాను. భారతలో ప్రజాస్వామ్యం పనిచేస్తుంటే.. నేను పార్లమెంట్‌లో నా మాట చెప్పగలను. ఇప్పుడు మీరు చూస్తున్నది ప్రజాస్వామ్యానికి పరీక్షా కాలం. నాపై ఆరోపణలు చేస్తున్న మంత్రులకు ఇచ్చినట్టే సభలో మాట్లాడేందుకు ఒక ఎంపీకి అవకాశం దక్కుతుందా..? వారు నన్ను మాట్లాడనిస్తారని నేను అనుకోవడం లేదు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. సభలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని తాను లోక్‌సభ స్పీకర్‌ను కోరానని చెప్పారు. 'సభలో మాట్లాడేందుకు సమయం ఇవ్వమని నేను స్పీకర్‌ను కోరాను. అక్కడ మాట్లాడటం నాకున్న హక్కు. అయితే ఆయన నాకు హామీ ఇవ్వలేదు. ఒక చిరునవ్వు నవ్వారు' అని వెల్లడించారు. 'నేను లండన్‌లో మాట్లాడిన మాటలను ఉద్దేశపూర్వకంగానే వక్రీకరిస్తున్నారు. కేంద్రం, ప్రధాని మోదీ.. అదానీ అంశంపై ఆందోళనగా ఉన్నారు. అందువల్లే ఈ వివాదాన్ని సిద్ధం చేశారు' అని విమర్శించారు.

### దేశ వ్యతిరేక వ్యాఖ్యలేం చేయలేదు..

కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో తాను చేసిన వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ తొలిసారి స్పందించారు. తానెలాంటి దేశ వ్యతిరేక ప్రసంగం చేయలేదని స్పష్టం చేశారు. పార్లమెంటు సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్తూ మీడియాతో ఈ మేరకు మాట్లాడారు. విదేశీగడ్డపై దేశాన్ని అవమానించారు అంటూ భాజపా చేస్తోన్న ఆరోపణలపై స్పందిస్తారా? అని రాహుల్‌ను మీడియా ప్రశ్నించగా.. 'ఒకవేళ నన్ను అనుమతిస్తే సభలో మాట్లాడ తానని, అవకాశం ఇవ్వకపోతే పార్లమెంట్ బయట మాట్లాడతానని చెప్పారు.

## అదే ప్రతిష్టంభన..

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్ష నేత, కాంగ్రెస్జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే నేతృత్వంలో భావసారూప్యత కలిగిన పార్టీలనాయకులంతా ఏకమయ్యారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గురువారం ఉదయం సభ ప్రారంభమైన వెంటనే తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు రాజ్యసభ వెల్లోకి దూసుకొచ్చారు. నలుపు రంగు దుస్తులు ధరించి, నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. దీంతో రాజ్యసభ ఛైర్మన్ ధన్ఖడ్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. లోక్‌సభలోనూ దాదాపు ఇలాంటి పరిస్థితులే ఎదురయ్యాయి. అదానీ వ్యవహారంలో జేపీసీ ఏర్పాటు చేయాల్సిందిగా విపక్ష నేతలు పట్టుబట్టారు. నల్లదుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వెల్లోకి దూసుకెళ్లి, భాజపా మంత్రులు, ఎంపీలు ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదంటూ ఆందోళనకు దిగారు. తన భావాలను స్వేచ్ఛగా ప్రకటించుకునేందుకు ప్రతిపక్షానికి అర్హత లేదా? అంటూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మధ్యాహ్నం కూడా ఇలాంటి పరిస్థితులే ఎదురవ్వడంతో ఉభయసభలూ రేపటికి వాయిదా పడ్డాయి. ఇవాళ సభల ప్రారంభానికి ముందు.. భావసారూప్యత గల పార్టీల నాయకులంతా రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గేను పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో కలిశారు. డీఎంకే, ఎన్సీపీ, ఎస్పీ, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, శివసేన, జేడీయూ, జేఎమ్ఎమ్, ఎండీఎంకే, ఆప్, వీసీకే, ఐఎంయూఎల్ పార్టీల నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. అనంతరం మల్లిఖార్జున ఖర్గే మీడియాతో మాట్లాడుతూ.. అదానీ విషయంలో విచారణకు సంయుక్త పార్లమెంటరీ సంఘాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలన్నీ పట్టుబడుతుం డటంతో.. ఆ అంశాన్ని పక్కదోవ పట్టించాలనే కుట్రతోనే భాజపా నాయకులంతా రాహుల్ క్షమాపణలు చెప్పాలంటూ కొత్త ఎత్తుగడ వేశారని విమర్శించారు.

## కుప్పకూలిన ఆర్మీ హెలికాప్టర్..

(మొదటిపేజీ తరువాయి)

సైన్యం వెల్లడించింది. ప్రమాదానికి గల కారణాలను అధ్యయనం చేస్తున్నట్లు పేర్కొంది. 'అరుణాచల్‌లోని బోమ్డిలా సమీపంలో గురువారం ఉదయం 9.15 గంటలకు ఆర్మీ చెందిన 'చీతా' హెలికాప్టర్‌కు ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోలర్‌తో సంబంధాలు తెగిపోయాయి'' అని సైన్యం తెలిపింది. బోమ్డిలాకు పశ్చిమాన ఉన్న మండలా ప్రాంతంలో ఇది కూలిపోయినట్లు వెల్లడించింది. ఈ క్రమంలోనే సైన్యం, సశస్త్ర సీమాబల్, ఇండో-టిబెటన్ బార్డర్ పోలీస్(ఐటీబీపీ) బలగాలు హుటాహుటిన రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. ఇక్కడి బంగ్లాజాప్ గ్రామ సమీపంలో హెలికాప్టర్ శకలాలు లభ్యమయ్యాయి. అయితే.. స్థానికంగా వాతావరణం పొగమంచుతో కూడిఉందని, 5 మీటర్ల పరిధి వరకే కనిపిస్తోందని స్థానిక పోలీసులు తెలిపారు.

# ఏపీ బడ్జెట్ రూ.2.79 లక్షల కోట్లు..

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదని విశ్వసించే ప్రభుత్వం తమదని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని రైతు భరోసా కేంద్రాల పనితీరును ప్రపంచం మెచ్చుకుందని తెలిపారు. మిగిలిన 7,853 రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుకు నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రాభివృద్ధిలో పాడిరంగం కీలక పాత్రం పోషిస్తుందని మంత్రి బుగ్గన తెలిపారు. గుడ్ల ఉత్పత్తిలో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉందన్నారు. మాంసం ఉత్పత్తిలో రెండో స్థానం, పాల ఉత్పత్తిలో 5వ స్థానంలో ఉందని వెల్లడించారు. పశువుల బీమా కోసం వైఎస్ఆర్ పశు బీమా పథకం తీసుకొచ్చినట్లు మంత్రి బుగ్గన వెల్లడించారు. రాష్ట్రంలో 340 సంచార పశువైద్యశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 154 నియోజవర్గాల్లో జంతు వ్యాధుల నిర్ధారణ కేంద్రాలు మంజూరు చేశామన్నారు.

### బడ్జెట్ కేటాయింపులు ఇలా..

- వైఎస్ఆర్ పెన్షన్ కానుక రూ.21,434.72 కోట్లు
- వైఎస్ఆర్ రైతు భరోసా రూ.4,020 కోట్లు
- జగనన్న విద్యా దీవెన రూ.2,841.64 కోట్లు
- జగనన్న వసతి దీవెన రూ.2,200 కోట్లు
- వైఎస్ఆర్-పీఎం బీమా యోజన రూ.1600 కోట్లు
- డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాల కోసం రూ.1,000 కోట్లు
- రైతులకు వడ్డీలేని రుణాలు రూ.500 కోట్లు
- వైఎస్ఆర్ కాపు నేస్తం రూ.550 కోట్లు
- జగనన్న చేదోడు రూ.350 కోట్లు
- వైఎస్ఆర్ వాహనమిత్ర రూ.275 కోట్లు
- వైఎస్ఆర్ నేతన్న నేస్తం రూ.200 కోట్లు
- వైఎస్ఆర్ మత్స్యకార భరోసా రూ.125 కోట్లు
- మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ రూ.50 కోట్లు
- రైతు కుటుంబాల పరిహారం కోసం రూ.20 కోట్లు
- లా నేస్తం రూ.17 కోట్లు
- జగనన్న తోడు రూ.35 కోట్లు
- ఈబీసీ నేస్తం రూ.610 కోట్లు
- వైఎస్ఆర్ కల్యాణమస్తు రూ.200 కోట్లు
- వైఎస్ఆర్ ఆసరా రూ.6700 కోట్లు
- వైఎస్ఆర్ చేయూత రూ.5000 కోట్లు
- అమ్మఒడి రూ.6500 కోట్లు
- మొత్తంగా డీబీటీ స్కీంలకు రూ.54,228.36 కోట్లు
- ధరల స్థిరీకరణ నిధి రూ.3,000 కోట్లు
- వ్యవసాయ యాంత్రీకరణ రూ.1,212 కోట్లు
- వైద్యం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం రూ.15,882 కోట్లు
- మన బడి నాడు-నేడు రూ.3,500 కోట్లు
- జగనన్న విద్యా కానుక రూ.560 కోట్లు
- పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధికి రూ.15,873 కోట్లు
- పురపాలక, పట్టణాభివృద్ధి రూ.9,381 కోట్లు
- స్కిల్ డెవలప్మెంట్ రూ.1,166 కోట్లు
- యువజన అభివృద్ధి, పర్యాటకం, సాంస్కృతిక శాఖ రూ.1,291 కోట్లు
- షెడ్యూల్ కులాల కాంపొనెంట్ కోసం రూ.20,005 కోట్లు
- షెడ్యూల్ తెగల కాంపొనెంట్ కోసం రూ.6,929 కోట్లు
- వెనుకబడిన తరగతుల కాంపొనెంట్ కోసం రూ.38,605 కోట్లు
- కాపు సంక్షేమం రూ.4,887 కోట్లు
- మైనార్టీల సంక్షేమం రూ.4,203 కోట్లు
- పేదలు అందరికీ ఇళ్లు రూ.5,600 కోట్లు
- పరిశ్రమలు, వాణిజ్యం రూ.2,602 కోట్లు
- రోడ్లు, భవనాల శాఖకు రూ.9,118 కోట్లు
- నీటి వనరుల అభివృద్ధికి (ఇరిగేషన్) రూ.11,908 కోట్లు
- పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ రూ.685 కోట్లు
- ఎనర్జీ రూ.6,456 కోట్లు
- గ్రామ, వార్డు సచివాలయ శాఖ రూ.3,858 కోట్లు
- గడప గడపకు మన ప్రభుత్వం రూ.532 కోట్లు

# సంక్షేమం, విద్యా, వైద్యానికి పెద్ద పీట..

అమరావతి, మార్చి 16 (మనం న్యూస్): 2023-24 బడ్జెట్లో సంక్షేమం, విద్యా, వైద్యానికి పెద్ద పీట వేసింది వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం.. మొత్తం బడ్జెట్ లో ఆర్థిక సేవలకు వ్యయం 69,306 కోట్లుగా ఉంది.. బడ్జెట్ కేటాయింపుల్లో సంక్షేమ రంగానికి ప్రభుత్వం పెద్ద పీట వేసింది.. 51,345 కోట్ల రూపాయలు సంక్షేమానికి కేటాయించారు.. మొత్తం కేటాయింపుల్లో ఇది 27 శాతం.. సాధారణ విద్యకు రెండో ప్రాధాన్యత కేటాయింపులు లభించాయి.. మాధ్యమిక, ఉన్నత విద్యకు 32,198 కోట్లు కేటాయించారు. మొత్తం కేటాయింపుల్లో ఇది 16 శాతంగా ఉంది.. మూడవ ప్రాధాన్యత వైద్య, ఆరోగ్య శాఖకు దక్కింది.. ఈ రంగానికి 15, 882 కోట్ల రూపాయలు కేటాయించారు.. మొత్తం కేటాయింపుల్లో వైద్యా, ఆరోగ్య శాఖ వాట 8 శాతంగా ఉంది. వార్షిక బడ్జెట్లో ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమానికి జగన్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. కోవిడ్ అనంతరం ప్రపంచంలో ఆరోగ్య సంరక్షణను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా మార్చాల్సిన అవసరం ఉంది. ఇది రాబోయే రోజులలో ఆర్థిక వృద్ధిని వేగవంతం చేస్తుంది. ఈవిషయంలో నాడు-నేడు కార్యక్రమం ద్వారా ఆరోగ్య సంరక్షణ సంస్థలను ప్రాథమిక స్థాయి నుంచి అత్యాధునిక ఆరోగ్య సంరక్షణ స్థాయికి మార్చడంతో పాటు సౌకర్యాల భౌతిక స్థాయిని పెంచడం మాత్రమే కాకుండా, అవసరమైన పరికరాలు, శిక్షణ పొందిన మానవ వనరులను సమకూర్చడంలో ఎంతో ఉపయోగపడనుంది. ఇక, జాతీయ ఆరోగ్య మిషన్ కింద 108 సేవలు, 104 సేవలు, కుటుంబ సంక్షేమం వంటి ప్రాధాన్యతా కార్యక్రమాలను బలోపేతం చేయడంతో పాటు, ముఖ్యమైన పథకాల కింద బడ్జెట్లో కేటాయింపులు చేసింది జగన్ సర్కార్.. వ్యాధులు రాకుండా తీసుకునే ముందస్తు చర్యల్లో భాగంగా, ఆరోగ్య సంరక్షణ సేవలను పౌరుల ఇంటి వద్దకు కుటుంబ వైద్యుల కార్యక్రమం ద్వారా తీసుకువెళ్తోంది ప్రభుత్వం. అనారోగ్య సమయాలలో రోలుగు ప్రయాణించిల్సిన అవసరం లేకుండా, తదపరి సంరక్షణపై మెరుగైన పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటోంది. దాదాపు 1.41 కోట్ల కుటుంబాలను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి ప్రభుత్వం తీసుకొచ్చింది. వ్యాధి గుర్తింపు, చికిత్స, నివారణ విధానాలకు 2,446 నుంచి 3,255కు వైఎస్సార్సీపీ ప్రభుత్వం పెంచింది. మన రాష్ట్రంలోనే కాకుండా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాలలో కూడా 716 సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు పొందో విధంగా ఈ పథకాన్ని విస్తరించిన విషయం విదితమే. కాగా, రూ.2,79,279 కోట్లతో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టింది ఏపీ ప్రభుత్వం.. రెవిన్యూ వ్యయం రూ.2,28,540 కోట్లు, మూలధన వ్యయం రూ.31,061 కోట్లు, రెవిన్యూ లోటు రూ.22,316 కోట్లు, ద్రవ్య లోటు రూ.54,587 కోట్లు, జీఎస్డీపీలో రెవిన్యూ లోటు 3.77 శాతం,ఏపీ ద్రవ్యలోటు 1.54 శాతంగా ఉంది.. కేటాయింపుల విషయానికి వస్తే.. వైఎస్సార్ పెన్షన్ కానుక- రూ.21,434.72 కోట్లు, వైఎస్సార్ రైతు భరోసా రూ.4,020 కోట్లు, జగనన్న విద్యాదీవెన రూ.2,841.64 కోట్లు, జగనన్న వసతి దీవెన- రూ.2,200 కోట్లు, వైఎస్సార్- పీఎం బీమా యోజన- రూ.1600 కోట్లు, డ్వాక్రా సంఘాలకు వడ్డీలేని రుణాల కోసం రూ.1,000 కోట్లు, రైతులకు వడ్డీలేని రుణాలు రూ.500 కోట్లు, వైఎస్సార్ కాపు నేస్తం- రూ.550 కోట్లు, జగనన్న చేదోడు-రూ.350 కోట్లు, వైఎస్సార్ వాహనమిత్ర-రూ.275 కోట్లు, వైఎస్సార్ నేతన్న నేస్తం-రూ.200 కోట్లు, వైఎస్సార్ మత్స్యకార భరోసా-రూ.125 కోట్లు ఇలా అనేక కేటాయింపులు చేసిన విషయం తెలిసిందే.

# మహిళా సాధికారతకు వేల కోట్లు..

అమరావతి, మార్చి 16 (మనం న్యూస్): మహిళా సాధికారత కోసం బడ్జెట్లో వేల కోట్ల రూపాయలు కేటాయించింది వైఎస్సార్సీపీ ప్రభుత్వం. పేద మహిళలు ఆర్థికంగా బలపడేందుకు, స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రత్యేక పథకాలను అమలు చేస్తోంది. మహిళా పాడిరైతులను ఏకీకృతం చేయడానికి అదే విధంగా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలతో సమానంగా మహిళా పాల సహకార సంఘాలను(ఎండీఎస్ఎస్) ప్రోత్సహించడానికి జగనన్న పాల వెల్లువ ప్రాజెక్టును వైఎస్సార్సీపీ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. 17 జిల్లాలలో సుమారు 2.5 లక్షల మంది మహిళా పాడి రైతుల కోసం ఈ ప్రాజెక్టును అమలు చేసింది. దళారులను తొలగించి పాడి రైతుల నుంచి నేరుగా 561 లక్షల లీటర్ల పాలను కొనుగోలు చేసి రూ.250 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు చెల్లించింది. ఈ విధానం ద్వారా పాల నాణ్యతను బట్టి గతంలో లభించే ధర కంటే లీటరుకు రూ.5-20 వరకు మెరగైన ధర లభిస్తోంది.

### వైఎస్సార్ ఆసరా..

స్వయం సహాయక సంఘాలలోని గ్రామీణ, పట్టణ పేద మహిళలకు ఏప్రిల్ 4, 2019 నాటికి బకాయి ఉన్న బ్యాంకు రుణాల మాఫీ కోసం వైఎస్సార్ ఆసరా పథకం కింద 4 విడతలుగా చెల్లిస్తామని ప్రభుత్వ ప్రకటించింది. దీని కోసం బడ్జెట్లో రూ.6,700 కోట్లు కేటాయించింది.

### వైఎస్సార్ సున్నా వడ్డీ

సకాలంలో రుణాలను తిరిగి చెల్లించే సంస్కృతిని ప్రోత్సహించడానికి 3 లక్షల రూపాయల వరకు బ్యాంకు రుణాలను కలిగి ఉన్న అన్ని స్వయం సహాయక సంఘాలపై వడ్డీ భారాన్ని తగ్గించడానికి సీఎం జగన్ ప్రభుత్వం వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేస్తోంది. దీనికి గాను 2019 సంవత్సరం నుండి గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలను కలుపుకొని స్వయం సహాయక సంఘాలకు చెందిన 1.02 కోట్ల మహిళలకు 3,615 కోట్ల రూపాయలు చెల్లించింది. ఈ చర్య మహిళా సాధికారత ప్రయత్నాలను బలోపేతం చేసి స్వయం సహాయక సంఘాలకు చెందిన పేద మహిళల ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కోసం 1,000 కోట్ల రూపాయలు కేటాయించింది.

### వైఎస్సార్ చేయూత

ప్రభుత్వం షెడ్యూలు కులాల, షెడ్యూలు తెగల, వెనుకబడిన తరగతుల మరియు అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన 45 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల 25 లక్షల మంది మహిళలకు సంవత్సరానికి 18,750 రూపాయల చొప్పున గత నాలుగేళ్లలో 75,000 వేల రూపాయలను ఇచ్చింది. ఈ మొత్తాన్ని లబ్దిదారులు తమ ఎంపిక ప్రకారం ప్రస్తుత జీవనోపాధి కార్యకలాపాలలోను లేదా కొత్త సంస్థల స్థాపనకు పెట్టుబడిగా పెట్టుకోవడంలోను ఉపయోగిస్తున్నారు. ఇప్పటి వరకు 26.7 లక్షల మంది మహిళా సభ్యులకు 3 విడతలుగా 14,129 కోట్ల రూపాయలను అందజేయడం జరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను వైఎస్సార్ చేయూత పథకం కోసం 5,000 కోట్ల రూపాయల కేటాయించింది.

### ఉజ్జావల, స్వధార్ గృహ పథకం

మహిళలకు సహాయం అందించడం కోసం 'ఉజ్జావల', 'స్వధార్ గృహ పథకం' క్రింద నడిచే గృహాలు, వన్ స్టాప్ సెంటర్లు, మహిళా ఉద్యోగినిల వసతి గృహాలు, సేవాగృహములు, ఉచితంగా పనిచేసే మహిళా హెల్ప్ లైన్ నెంబర్లు పనిచేస్తున్నాయి. సమీకృత మహిళా సాధికారత కార్యక్రమం అమలును పర్యవేక్షించేందుకు మిషన్ శక్తి పథకం కింద రాష్ట్ర కమిటీని వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను మహిళా అభివృద్ధి, పిల్లల సంక్షేమం కోసం 3,951 కోట్ల రూపాయలు కేటాయించింది.

## 4.4 లక్షల గృహ నిర్మాణాలు పూర్తి..

అమరావతి, మార్చి 16 (మనం న్యూస్): పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద 2023 సంవత్సరం చివరి నాటికి 30.2 లక్షల శాశ్వత గృహాలను అర్హులైన లబ్దిదారులందరికీ అందించడానికి సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉంది. 18.63 లక్షల ఇళ్లకు గాను, మొదటి దశలో 16.91 లక్షల ఇళ నిర్మాణం ప్రారంభంకాగా, వీటిలో 4.4 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలిన ఇళ్ల నిర్మాణం వివిధ దశలలో ఉంది. వైఎస్సార్ జగనన్న కాలనీలను నీటి సరఫరా, విద్యుత్, రోడ్లు, మురుగు కాల్వల ఏర్పాటు వంటి అన్ని మౌలిక సదుపాయాలతో ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. భారాన్ని తగ్గించడానికి, ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ ప్రక్రియ, ఇ-ప్రొక్యూర్మెంట్ వేదికల ద్వారా టెండర్లను ఖరారు చేసిన మార్కెట్ ధర కంటే ధరకు 20 మెట్రిక్ టన్నుల ఇసుక, 5 మెట్రిక్ టన్నుల సిమెంట్, స్టీల్, 12 ఇతర నాణ్యమైన భవన నిర్మాణ సామగ్రిని ఉచితంగా అందిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద 5,600 కోట్ల రూపాయలను కేటాయించింది.

## కోర్టు అంటే లెక్కలేదా..?

(మొదటిపేజీ తరువాయి)

చేసింది ఆంధ్రప్రదేశ్ హైకోర్టు.. కాగా, గతంలోనూ అధికారులపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి.. ఇక కొందరు అధికారులకు హైకోర్టు శిక్షలు కూడా విధించిన విషయం విదితమే.. కోర్టు ఆదేశాలను పట్టించుకోని అధికారులపై మండిపడుతూనే ఉంది హైకోర్టు.

## 'పరిశ్రమ' హోదాతోనే పర్యాటక వికాసం

న్యూఢిల్లీ, మార్చి 16: పర్యాటక రంగానికి రాష్ట్రాలు పరిశ్రమ హోదా కల్పిస్తే అది మరింతగా రాణిస్తుందని పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రాజ్యసభలో గురువారం వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలదే. పరిశ్రమ హోదా పొందడం ద్వారా పర్యాటక రంగం దాని అనుబంధ రంగాలు ఇతర పరిశ్రమలతో సమానంగా విద్యుత్ చార్జీలు, ఇతర పన్నుల వంటి ద్వారా లబ్ది పొందే అవకాశం ఉంటుంది. ప్రస్తుతానికి పర్యాటక రంగం వాణిజ్యం కేటగిరిలో ఉన్నందున అధిక రేట్లను చెల్లించాల్సి వస్తోందని మంత్రి తెలిపారు. పర్యాటకానికి పరిశ్రమ హోదా కల్పిస్తే భారీ పెట్టుబడులు అవసరమయ్యే ఆతిధ్య రంగంలో పెట్టుబడి ఖర్చు గణనీయంగా తగ్గి ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులకు ప్రోత్సాహకారిగా మారుతుందని అన్నారు. దేశంలో ఇప్పటికే గుజరాత్, కేరళ, రాజస్థాన్, పంజాబ్, గోవా, కర్నాటక, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, జమ్మూ,కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, త్రిపుర వంటి పదకొండు రాష్ట్రాలు పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించినట్లు మంత్రి తెలిపారు. మిగిలిన ఇతర రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలు కూడా పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించాల్సిందిగా తమ మంత్రిత్వ శాఖ పదేపదే సలహా ఇస్తోంది. ఆయా రాష్ట్రాల అధికారులతో ఉన్నత స్థాయిలో జరిగే ఇంటరాక్టివ్ సెషన్స్లోను, సమావేశాలలోను, కరస్పాండెన్స్ ద్వారా వాటిని ఒప్పించే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు.

## ఒంగోలు ఎంపీకి ఈడీ నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

సాక్షులను కలిపి ప్రశ్నిస్తున్నామని చెప్పిన ఈడీ అధికారులు.. కొందరిని మళ్లీ విచారణకు పిలిచినట్టు కోర్టుకు తెలిపారు. ఈరోజు విచారణకు ఎమ్మెల్సీ కవిత రాలేదని ఈడీ కోర్టుకు సమాచారం ఇచ్చింది. పిళ్లై కస్టడీ పొడిగిస్తే శుక్రవారం బుచ్చిబాబుతో కలిసి ప్రశ్నిస్తామంది. ఈ కేసులోనే వైసీపీ ఎంపీ శ్రీనివాసుల రెడ్డికి నోటీసులు ఇచ్చినట్టు న్యాయస్థానానికి ఈడీ తెలిపింది.

## అంకెల గారడీతో మాయ చేశారు..

- అప్పులను ఆదాయంగా చూపారు
- ప్రజలకు అవాస్తవాలను వెల్లడించారు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

అమరావతి, మార్చి 16 (మనం న్యూస్): అసెంబ్లీలో ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ 2023-24పై విమర్శలు గుప్పించారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు. అప్పులను ఆదాయంగా చూపించ కూడదని ఆర్బీఐ చేసిన సూచనలు కూడా పరిగణలోకి తీసుకోకుండా అసెంబ్లీ సాక్షిగా ఆర్థిక మంత్రి బుగ్గన అంకెల గారడీతో మాయ చేశారు. ఆయన అందుకు విదేశీ ప్రముఖుల వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ బడ్జెట్‌కు తనవాదనలను సమర్ధించుకుంటూ రాష్ట్రప్రజలకు అవాస్తవాలను శాసన సభలో వెల్లడించారని తప్పుపట్టారు. కేంద్ర నిధులు, పథకాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం గొప్పతనంగా శాసన సభలో ఎలా చెబుతారని ప్రశ్నించారు. ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చి తీసుకునే రుణాలు ఎంత అనేది వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. కనీసం కాగ్‌కు కూడా నివేదిస్తున్నారో లేదో తెలియని గందరగోళం ప్రభుత్వంలో కొట్టచ్చినట్లు కనపడుతోంది. విభజన ఆంధ్రప్రదేశ్‌కుఅంటే 2014 నుండి రాష్ట్రానికి 9 లక్షల3 వేల 336 కొట్లు అప్పులు ఉన్న పరిస్థితి. కేంద్ర ప్రభుత్వ పథకాలు, నిధులను ఈ ప్రభుత్వం స్టిక్కర్లు వేసుకున్న విధంగా ఇది ఒక స్టిక్కర్ బడ్జెట్‌గా అభివర్ణించారు సోమువీర్రాజు. రాష్ట్ర బడ్జెట్ 80శాతం రెవిన్యూ వ్యయం కాగా మూలధనం వ్యయం పెరగక పోవడం ఆందోళన కలిగించే అంశంగా పేర్కొన్నారు సోము వీర్రాజు.. మూలధనం వ్యయం లేకపోతే ఆర్థిక కార్యకలాపాలు జరగక దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలు కుంటుపడతాయి. ద్రవ్యలోటు పెరిగిపోవడంతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసే పరిస్థితి ఏర్పడుతోంది. ప్రతినెల సుమారుగా 21 వేల కోట్లు రాష్ట్రానికి అవసరం ఉండగా సుమారు 10 వేల కోట్లు ఆదాయంగా వస్తున్నా ప్రతి నెల నాలుగువేల కోట్లు అప్పులు చేస్తున్నట్లు చెబుతున్నారు.. మిగిలిన ఏడు వేల కోట్లు ఏవిధంగా సమకూరుతున్నాయన్న విషయం ప్రభుత్వం వెల్లడించడం లేదు. కాబట్టి ప్రభుత్వ ఆర్థిక తీరుతెన్నులపై మిలియన్ డాలర్ల అనుమానం కలుగుతోంది. కార్పొరేషన్లపై తీసుకున్న రుణాలకు సంబంధించిన విషయాలపై ఆర్థిక మంత్రి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్లు రిజిస్ట్రేషన్ కంపెనీ రిజిస్ట్రార్ వద్ద రిజిస్ట్రేషన్ జరుగుతుంది. కాబట్టి కార్పొరేషన్ లావాదేవీలు కంపెనీ రిజిస్ట్రార్ కు నివేదిస్తున్నారా? లేదా? అని ఘాటుగా ప్రశ్నించారు సోము వీర్రాజు.

# ఎమ్మెల్సీ 'స్థానిక' కోటాలో వైసీపీ గెలుపు..

అమరావతి/హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో ఉపాధ్యాయ, పట్టభద్రుల, స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. గురువారం ఉదయం 8గంటల నుంచి అధికారులు ఓట్ల లెక్కింపు ప్రక్రియను మొదలు పెట్టారు. ఆయా లెక్కింపు కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ నెల 13న ఏపీలోని 3 గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలతో పాటు, రెండు ఉపాధ్యాయ, నాలుగు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలతో పాటు తెలంగాణలోని ఒక ఉపాధ్యాయ స్థానంలో ఎన్నికల పోలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. తొలుత స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య భారీ సంఖ్యలో ఉండటంతో తుది ఫలితాలు వెల్లడయ్యే సరికి ఇంకా చాలా సమయం పట్టనుంది.

### శ్రీకాకుళంలో నర్తు రామారావు విజయం

శ్రీకాకుళం జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితం వెలువడింది. వైకాపా అభ్యర్థి నర్తు రామారావు విజయం సాధించారు. ఈ ఎన్నికలో మొత్తం 752మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఓటు వేయగా.. 12ఓట్లు చెల్లలేదు. వైకాపా నేత రామారావుకు 632 ఓట్లు రాగా.. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆనేపు రామకృష్ణకు 108 ఓట్లు పోల్ అయ్యాయి.

### పశ్చిమ గోదావరి, కర్నూలులో వైకాపాదే గెలుపు..

పశ్చిమగోదావరి జిల్లాలో స్థానిక రెండు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఈ రెండు స్థానాల్లోనూ వైకాపా అభ్యర్థులే గెలుపొందారు. వైకాపా అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ విజయం సాధించారు. మొత్తం 1105 ఓట్లు ఉండగా.. 1088 మంది స్థానిక ప్రజాప్రతినిధులు ఓటు వేశారు. వైకాపాకు చెందిన కవురు శ్రీనివాస్‌కు 481 మొదటిప్రాధాన్యతా ఓట్లు వచ్చాయి. వంకా రవీంద్రనరాథ్‌కు 460 ఓట్లు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్‌కు 120 ఓట్లు వచ్చాయి. మరోవైపు, కర్నూలు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థి డాక్టర్ మధుసూదన్ విజయం సాధించారు. మొత్తం ఓట్లు 1136 కాగా.. వీటిలో 53ఓట్లు చెల్లలేవు. వైకాపా అభ్యర్థికి 988 ఓట్లు రాగా.. స్వతంత్ర అభ్యర్థి మోహన్ రెడ్డికి 85 ఓట్లు వచ్చాయి. మరో స్వతంత్ర అభ్యర్థి వెంకట వేణుగోపాల్ రెడ్డికి 10 ఓట్లు వచ్చాయి. ఇదిలా ఉండగా, పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు అనంతపురం జేఎన్టీయూలో కొనసాగుతోంది.

### ఉత్తరాంధ్రలో ఫలితానికి 48గంటలు!

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు 48 గంటలు పడుతుందని అంచనా. ఆరు జిల్లాల్లో కలిపి 2లక్షలకు పైగా ఓట్లు పోలయ్యాయి. 2007, 2011, 2017లలో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ రెండో ప్రాధాన్య ఓటుతోనే అభ్యర్థులు విజయం సాధించారు. ఈసారి కూడా ఆ ఓటే కీలకం కానుందని సమాచారం. విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో 500మంది సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి.. విడతల వారీగా ఓట్ల లెక్కింపులో పాల్గొననున్నారు. ఏడు రౌండ్లలో 2,00,926 ఓట్లు లెక్కింపునకు కనీసం 10 నుంచి 12గంటలు పడుతుంది.

మరోవైపు, శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం; ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు; కడప-అనంతపురం-కర్నూలు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానాలు, ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు, కడప-అనంతపురం-కర్నూలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానాలు, పశ్చిమగోదావరిలో 2, శ్రీకాకుళం, కర్నూలులో ఒక్కొక్కటి చొప్పున స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గాలతో పాటు తెలంగాణలో హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో పోలింగ్ నిర్వహించారు. స్థానిక సంస్థల నియోజకవర్గాలకు సంబంధించి అనంతపురం, కడప, నెల్లూరు, తూర్పుగోదావరి, చిత్తూరు జిల్లాలకు చెందిన 5 స్థానాలు ఇప్పటికే ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

## ప్రతిభకు పురస్కారం




పలమనేరు, మార్చి 16, మనం న్యూస్: రోజుకో రూపాయి పొదుపు ద్వారా వచ్చిన డబ్బుతో సేవా కార్యక్రమాలతో పాటు.... చదువులో ఉన్నతంగా రాణిస్తున్న విద్యార్థులకు ఈరోజు సన్మానం చేయడం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి పలమనేర్ పట్టణంలో వినూత్నంగా రోజుకో రూపాయి పొదుపు ద్వారా వచ్చిన డబ్బుతో..... . శ్రీ వాసవి ఆర్యవైశ్య వాట్సాప్ గ్రూప్ ద్వారా... ఈరోజు, పలమనేర్ టౌన్, బజారు వీధిలోని పరిపాటి కళ్యాణ మండపం నందు, వైశ్య విద్యార్థులకు చదువులో, అటు స్పోర్ట్స్ లో, ఉన్నతంగా రాణించిన విద్యార్థులకు అత్యంత వైభవంగా మరియు ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమంలో విద్యార్థులు చదువులో తమ అనుభవాలను, తాము ఏ విధంగా చదివింది కూలంకషంగా వివరించారు. మెడిసిన్లో మెరిట్ సాధించి, ఎంబిబిఎస్ ఎస్ వి మెడికల్ కాలేజ్ తిరుపతి నందు, మూడో సంవత్సరం చదువుతున్న, లహరి (దివ్య) గారికి, బీటెక్ మొదటి సంవత్సరంలో 95 శాతం సాధించిన కందూరు నిహారిక గారికి, బీటెక్ డేటాసైన్స్ థర్డ్ ఇయర్లో 92% సాధించిన సాయి పూజిత గారికి, డిప్లమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్ లో 95% సాధించిన సాయి కీర్తన గారికి మరియు స్పోర్ట్స్ కోటాలో ఉన్నతంగా రాణించిన లిఖిత్ సాయి లను సన్మానించడం జరిగింది. రోజుకో రూపాయి పొదుపు ద్వారా వచ్చిన మొత్తంతో, ఈ విధంగా చదువును ప్రోత్సహించే కార్యక్రమాలు సేవా కార్యక్రమాలు చేయడం పట్ల, పలువురు పట్టణ ప్రముఖులు సంతోషాన్ని, ఆశీర్వాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## కుప్పంలో ఘనంగా అమరజీవి జయంతి వేడుకలు...



కుప్పం, మార్చి 16, మనం న్యూస్ : కుప్పంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు.గురువారం కుప్పం కొత్తపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు దక్ష ప్రకాష్ సంఘం అధ్యక్షులు సతీష్ కుమార్, సంఘం ప్రతినిధులు చంద్రశేఖర్, ఆనంద కుమార్, శ్రీనివాసులు,మధు,నాగరాజ్, అప్పి, రాజు, సాయినాథ్ , రమేష్,సంతోష్,నాయకులు,అభిమానులు పాల్గొన్నారు.

## సుజ్ఞానంద ఆశ్రమంలో వైభవంగా అఖండ రామకోటి



కుప్పం, మార్చి 16, మనం న్యూస్ : కుప్పం పట్టణం ట్రావెల్స్ బంగ్లా రోడ్డులోని శ్రీ సుజ్ఞానంద ఆశ్రమంలో అఖండ రామకోటి భజనలు అత్యంత వైభవంగా జరిగాయి.మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ అఖండ రామకోటి కార్యక్రమం గురువారంతో వైభవంగా ముగిసింది. వేద పండితులు శ్రీ సోమశేఖర శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక హోమ కార్యక్రమాలను నిర్వహించారు. భజన బృందాలచే నిర్విరామంగా రామ భజన కొనసాగింది. ఈ కార్యక్రమాలలో పెద్ద ఎత్తున భక్తులు హాజరై రామకోటి భజనలు పూజారి కార్యక్రమాలలో పాల్గొన్నారు.గురువారం మధ్యాహ్నం సంతర్పణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ ఏప్రిల్ 15న వార్షికోత్సవ కార్యక్రమాన్ని గొప్పగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలలో వెంకటాచలపతి శెట్టి,రాజు, నంద కుమార్, చంద్ర, మురుగేష్ ,బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి



కురబలకోట, మార్చి 16, మనం న్యూస్: బోగస్ ఆపై నకిలీ ఓట్లను నిలువరించేందుకు ఓటర్ కార్డుకు ప్రతి ఒక్కరూ ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేసుకోవాలని తహశీల్దారు ఎం. భీమేశ్వరరావు కోరారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రధానంగా బీఎల్ఓలు ప్రత్యేక శ్రద్ధ వహించి సోమవారం లోగా ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలన్నారు. బాధ్యతా రహితంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో 32,813 మంది ఓటర్లు వున్నారన్నారు. వీరిలో మహిళలు 16,571, పురుష ఓటర్లు 16,242 మంది ఉన్నారన్నారు. ఇప్పటి వరకు 26,992 ఓటర్ కార్డులకు ఆధార్ అనుసంధానం జరిగిందన్నారు. 82.26 శాతం పూర్తయిందన్నారు. మిగిలిన ఓటర్లు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వెంటనే తమ ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. బీఎల్ ఓలకు వీఆర్వోలు, రేషన్ డీలర్లు. అంగన్వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శుల, వీఆర్ఏలు, గ్రామ వాలంటీర్లు సహకరించి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న గంజాయి పట్టివేత

**-చాకచక్యంగా నిందితులను పట్టుకున్న సిఐ సుబ్బారెడ్డి**



రేణిగుంట, మార్చి 16, మనం న్యూస్ ప్రతినిధి : అక్రమంగా కారులో గంజాయిని తరలిస్తున్న వ్యక్తులను డీఎస్పీ రామచంద్ర ఆధ్వర్యంలో సీఐ సుబ్బా రెడ్డి అదుపులోకి తీసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి.. బుధవారం నాడు వాహనాలు తనిఖీ చేసే నేపథ్యంలో టిఎన్02 బిడి0538 నెంబర్ గల ఒక కారు రమణ విలాస్ సర్కిల్ వైపు అతివేగంతో వస్తూ కొంత దూరంలోనే పోలీసులను చూసి నడుపుతున్న కారుని హఠాత్తుగా ఆపడంతో అనుమానం వచ్చిన పోలీసు సిబ్బంది చాకచక్యంగా వాహనం దగ్గరికి వెళ్లి అందులో ఉన్న వ్యక్తులలో ఒక వ్యక్తి నీ రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ ఏఎన్ఆర్ కాలనీకి చెందిన కుమార్ అనే వ్యక్తిని పట్టుకుని కారు ని తనిఖీ చేయగా 19 కేజీలను గంజాయిని స్వాధీనపరచుకున్నారు. కుమార్ ని విచారించగా అతను ఇచ్చిన సమాచారం ప్రకారం అదే రోజు ఆరు గంటలకు రేణిగుంట మండలం అంకమ్మ నాయుడు మిట్ట గ్రామం వద్దకు వెళ్లగా పురుషోత్తమన్ మణికంఠం, రాజు, పెరుమాళ్ శివ పెరుమాళ్ కన్నన్ నలుగురు వద్ద నుండి సుమారు నాలుగు కేజీల గంజాయిని స్వాధీనపరుచుకున్నారు. వారందరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి మొత్తం 24 కేజీల గంజాయిని స్వాధీనం చేసామని గంజాయి విలువ సుమారు 75 వేల రూపాయలు ఉంటుందని వారందరిని రిమాండ్ తరలిస్తున్నామని డీఎస్పీ రామచంద్ర సీఐ సుబ్బారెడ్డి తెలిపారు.ఓటేరు చెందిన వంశీ గంజాయి స్మగ్లర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అక్రమంగా గంజాయిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎవరైనా గంజాయిని తరిలిస్తుంటే 100 కి డయల్ చేసి సమాచారం అందించాలని డి.ఎస్.పి రామచంద్ర తెలిపారు.

# ప్రశాంతంగా ఇంటర్ సెకెండ్ ఇయర్ పరీక్షలు

**-1161 మంది విద్యార్థులు గైర్హాజరు**

**- సీసీ కెమెరాలు నిఘా లో పరీక్షలు**

**ఇద్దరు విద్యార్థులు డిబార్**




తిరుపతి, మార్చి 16, మనం న్యూస్ : ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు గురువారం ఇంటర్ రెండోవ సంవత్సరం తెలుగు,సంస్కృతం పరీక్షలు జరిగాయి.మొత్తం రెండు జిల్లాలోని 141 సెంటర్లల్లో జనరల్ కేటగిరిలో 42300 మంది విద్యార్థులకు గానూ 1161 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 41139 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని,అదేవిధంగా తిరుపతిలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు తిరుపతి ఆర్ ఐ వో వి రమేష్ విలేకరులకు తెలిపారు. ఇదిలా ఉండగా రెండోవ రోజు కూడా పరీక్షలు రాస్తున్న విద్యార్థుల యొక్క హాల్ టికెట్ లో సరైనటువంటి సెంటర్ యొక్క అడ్రస్ లేనందువలన చాలామంది విద్యార్థులు అడ్రస్ తెలియక ఆందోళన చెందారు.ఈ విషయం లో ఇంటర్మీడియట్ బోర్డు ఘోరంగా విఫలమైందని చెప్పొచ్చు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయం మేరకు సీసీ కెమెరాలు, పోలీస్,రెవెన్యూ,ఇంటర్ విద్యాశాఖ అధికారులు,ఇతర అధికారుల సమన్వయంతో ప్రతిష్టాత్మకంగా ప్రశాంత వాతావరణంలో ఇంటర్ రెండోవ సంవత్సరం పరీక్ష జరిగాయి.నేడు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ పేపర్ వన్ జరుగుతుందని తెలిపారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ సీజ్



కల్లూరు, మార్చి 16, మనం న్యూస్ : పులిచెర్ల మండలం చల్లావారిపల్లి నుంచి కల్లూరు వైపు గురువారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను సీజ్ చేసి డ్రైవర్ ను కల్లూరు పోలీసులకు అప్పగించినట్లు పులిచెర్ల స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో స్టేషన్ సీఐ శ్రీనివాసమూర్తి, ఎస్సై కవీశ్వర్ నాయుడు తెలిపారు. ఎస్ ఈ బి పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చల్లావారిపల్లి వద్ద ఎస్ఈబీ పోలీసుల వాహనాలు తనిఖీచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కల్లూరు వైపు ఇసుకతో వెళుతున్న ట్రాక్టర్ ను ఆపి రికార్డులు పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా నాలుగు టన్నుల ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఇసుక ట్రాక్టర్ ను సీజ్ చేసి డ్రైవర్ హరిక్రిష్ణను కల్లూరు పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో ఎస్ఈబి పోలీసులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 6న తిరుమలలో తుంబురు తీర్థ ముక్కోటి



తిరుమల, మార్చి 16, మనం న్యూస్: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి ఏడున్నర మైళ్ల దూరంలో వెలసివున్న తుంబురుతీర్థముక్కోటి ఉత్సవం ఏప్రిల్ 6న జరుగనుంది. పురాణప్రాశస్త్యం ప్రకారం తిరుమలలోని శేషగిరులలో 3 కోట్ల 50 లక్షల పుణ్యతీర్థాలు ఉన్నాయని ప్రతీతి. ఈతీర్థాలలో ధర్మ, జ్ఞాన, భక్తి, వైరాగ్య, ముక్తిప్రదాలు కలిగించేవి 7తీర్థాలు. అవి స్వామివారి పుష్కరిణి, కుమారధార,తుంబురు, రామకృష్ణ, ఆకాశగంగ, పాపవినాశనం మరియు పాండవతీర్థాలు. ఈతీర్థాలలో ఆయా పుణ్యఘడియల్లో స్నానమాచరిస్తే సర్వపాపాలు తొలగి ముక్తి సమకూరుతుందని పురాణ వైశిష్ట్యం.ఫాల్గుణ మాసంలో ఉత్తరఫల్గుణీ నక్షత్రంతో కూడిన పౌర్ణమినాడుతుం బురుతీర ముక్కోటి నిర్వహించడం ఆనవాయితీ. ఈ పర్వదినానతీర్థస్నాన మాచరించి, దానధర్మాలు చేసి స్వామివారిని భక్తులు దర్శించుకుంటారు. ప్రకృతిసౌందర్యాలనడుమ నిర్వహించేతుంబురుతీర్థముక్కోటిని దర్శించి, స్నానమాచరించడం ఒక ప్రత్యేక అనుభూతిగా భావిస్తారు. ఈ ముక్కోటి లో టిటిడి అధికారులు, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారు.

## మున్సిపాలిటీలో కొత్త లైట్లు ను వేస్తున్న పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ సుధీర్



కుప్పం, మార్చి 16, మనం న్యూస్ : కుప్పం మున్సిపాలిటీలో తిరుపతి గంగమ్మ గుడి దగ్గర నుండి చెరువు కట్ట వరకు రోడ్డు డివైడర్ల మధ్యలో ఎలక్ట్రికల్ బట్టర్ ఫ్లై లైట్స్ నూతనంగా అమర్చడం జరిగింది. పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ డా. సుధీర్ , అదేవిధంగా 13వ తేదీ జరిగిన గ్రాడ్యుయేట్ అండ్ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్ఆర్సిపి అభ్యర్థుల తరపున ఏజెంట్లకు పనిచేసిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్సీ శ్రీ భరత్ మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్ మరియు వైయస్సార్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఎస్వీబీసీకి రూ 11 లక్షల విరాళం



తిరుపతి(టీటీడీ), మార్చి 16, మనం న్యూస్: మహారాష్ట్ర కు చెందిన సునీత లఖన్ కుమార్ అగర్వాల్ గురువారం ఎస్వీబీసీ ట్రస్ట్ కు రూ 11 లక్షలు విరాళం అందించారు. ఎస్వీబీసీ కార్యాలయంలో చైర్మన్ సాయికృష్ణ యాచెంద్ర, సిఈవో షణ్ముఖ్ కుమార్ కు దాత ప్రతినిధులు రాఘవేంద్ర, బాలసుదర్శన్ రెడ్డి ఈ మేరకు డిడి అందజేశారు.


## సీతారామచంద్ర స్వామి దేవాలయంలో మహా కుంభాభిషేక వేడుకలు




రేణిగుంట, మార్చి 16, మనం న్యూస్ ప్రతినిధి: ఎలమండ్యమ్ పంచాయతీ పరిధిలోని మర్రి గుంట గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో గురువారం మహా కుంభాభిషేక వేడుకలు కన్నుల పండుగలా జరిగాయి. వేద పండితులు మేళ తాళాలు మంగళ వాయిద్యాలు నడుమశాస్త్రక్తంగా నిర్వహించారు, గణపతి హోమం, కలశ స్థాపన, విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన కార్యక్రమాలను .మహిళలు హిందూ సాంప్రదాయ పద్ధతిలో గోప? పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కుంభాభిషేక వేడుకలకు రేణిగుంట జడ్పిటిసి మాజీ సభ్యుడు భక్తిమాల తిరుమలరెడ్డి,, వైఎస్ఆర్సిపి నాయకుడు గంగయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నిర్వాహకులు ఆలయ మర్యాదలతో సత్కరించగా, అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందచేసారు. ఈ సంధర్బంగా విశేష విద్యుత్ దీపాలంకరణలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# విద్యుద్ఘాతానికి గురై ఒకరు మృతి

**-మరొకరికి తీవ్ర గాయాలు**






వి కోట, మార్చి 16, మనం న్యూస్ : వి.కోట మండలం,ముధరం దొడ్డి గ్రామపంచాయతీ,నడమంత్రం గ్రామంలో విద్యుత్ ఘాతంతో ఓ వ్యక్తి మృతి చెంది మరో వ్యక్తి కి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే నడమంత్రం గ్రామానికి చెందిన కృష్ణ బాలాజీ ఆటవి ఉత్పత్తిలు సేకరిస్తూ జీవనం సాగించేవారు. ఎప్పటిలాగే ఉదయం నడమంత్రం చెరువు వద్దకు బహిర్గతం కి వెళ్లారు. చెరువులో విద్యుత్ స్తంభం నుండి తెగిపోయిన స్టే వైర్ చెరువులోని నీటిలో తాకుతూ ఉండేది.ఈ క్రమంలో బాలాజీ కాల కృత్యాలు తీర్చుకునేందుకు దిగారు. విద్యుత్ షాక్కు గురై పడిపోవడంతో పక్కనే ఉన్న గమనించిన కృష్ణప్ప పరుగున వెళ్లి కాపాడే ప్రయత్నం చేశారు.దీంతో విద్యుత్ షాక్ తగిలి కృష్ణప్ప అక్కడికక్కడే మృతి చెందారు. బాలాజీ తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. గమనించిన గ్రామస్తులు హుటాహుటిన వి.కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందారని ధ్రువీకరించారు.ఏళ్ల తరబడి తెగిపోయిన స్టే వైర్ బాగు చేయాలని రెస్కో లైన్ మాన్ జయప్పకు మొరపెట్టుకున్న పట్టించుకోలేదని దీంతో కృష్ణప్ప మృత్యువాత పడాల్సిన దుస్థితి ఏర్పడిందని బాధితులు గ్రామస్తులు వాపోయారు.రెస్కో నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్న నిర్లక్ష్యపు నీడలోనే అధికారులు కొనసాగడంపై గ్రామస్తులు ఆగ్రహ వ్యక్తం చేశారు.మృతికి కారణమైన లైన్మెన్ పై చర్యలు తీసుకోవాలని వి.కోట అంబేద్కర్ సర్కిల్ అంబేద్కర్ విగ్రహం ఎదుట మృతదేహాన్ని ఉంచి ధర్నా,రాస్తారోకో చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామస్థులు ,మాట్లాడుతూ అటవీ ఉత్పత్తులతో జీవనం సాగిస్తున్న కుటుంబాన్ని వీధి నా పడేలా చేసిన రెస్కో అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెస్కో అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రెస్కో అధికారులు వచ్చేదాకా మృత్యదేహాన్ని తరలించమని శవ పంచనామాకు ఇచ్చేది లేదని రోడ్డుపై బైఠాయించారు దీంతో వి.కోట ఎస్సై రాంభూపాల్ రేస్కో అధికారులకు సమాచారం చేరవేశారు. వెంటనే బాధితుల వద్దకు రావాలని కోరారు. వెంటనే రెస్కో ఏడి బాధితుల నిరసన వద్దకు చేరుకున్నారు.మీ నిర్లక్ష్యం వల్లే గిరిజనుడు మృతి చెందాడని బంధువులు గ్రామస్తులు అధికారిని నిలదీశారు. బాధ్యత కుటుంబానికి 5 లక్షల పరిహారం ఐదు ఎకరాల భూమి కుటుంబంలో ఓ వ్యక్తికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.దీంతో రెస్కో చైర్మన్ ని సంప్రదించి తక్షణం రెండు లక్షల పరిహారానికి ఒప్పుకున్నారు 10000 రు,అంతక్రియలకు అందజేశారు. దీంతో బంధువులు శాంతించి మృతదేహాన్ని సవపరీక్షకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు, చేస్తున్నారు.



## శ్రీనివాస మంగాపురం దళితవాడలో సిసి రోడ్డుకు భూమి పూజ...



చంద్రగిరి ,మార్చి 16, మనం న్యూస్ : చంద్రగిరి మండల పరిధిలోని మిట్టపాలెం గ్రామ పంచాయతీ శ్రీనివాసమంగాపురం దళితవాడలో తుడా నిధుల ద్వారా మంజూరు కాబడిన సి.సి రోడ్డుకు భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సిసి రోడ్డుకు నిధులు మంజూరు చేయడానికి కృషిచేసిన శాసనసభ్యులు చెవి రెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డిలకు గ్రామస్తు తరపున కృతజ్ఞతలు తెలుపుతు న్నామన్నారు. మిట్టపాలెం పంచాయతీలో ఇప్పటికే తుడా నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి యంపిపి హేమేంద్ర కుమార్ రెడ్డి, తొండవాడ డివిజన్ అధ్యక్షులు పి. నాగరాజు, మిట్టపాలెం, ఉప సర్పంచ్ యం. వేణుగోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ బాలసుబ్రమణ్యం, కాంట్రాక్టర్ సాయి , గ్రామస్తులు పాల్గొన్నారు.

# రెగ్యులర్ వెటర్నరీ ఎక్కడ ?



విడపనకల్లు మార్చి 16 మనం న్యూస్ : గత కొన్ని ఏళ్లగా పశు వైద్యాధికారి లేక కిందస్థాయి సిబ్బంది ఇన్చార్జిలతోనే కొనసాగుతుంది. రెగ్యులర్ వెటర్నరీ ఎక్కడని పలువురు రైతులు వాపోతున్నారు. రెగ్యులర్ పోస్ట్ అంటూ చూపడం లేదు. స్థానిక ఉన్న వెటర్నరీ పశు వైద్యశాలలో గత కొన్ని ఏళ్లగా అటెండర్, డాక్టరు, కిందిస్థాయి పోస్టులన్నీ ఇన్చార్జిల పాలనలోనే సాగుతున్నాయి. ఒక దగ్గర డ్యూటీ చేస్తే ఇంకొక దగ్గర వేతనాలు తీసుకుంటూ వాళ్ళ ఇష్టం వచ్చినట్టు మందులు అమ్ముకుంటున్నారు. ప్రతి పనికి ఓ రేటు అంటూ హాట్ టాపిక్‌గా మారుతున్నారు. అడిగే నాథుడే కరువయ్యాడు. కొన్ని గ్రామాల్లో పశు వైద్యశాలల్లో కనీసం వాకిలి తెరవడం కూడా చూడలేదంటున్నారు రైతులు, ప్రజలు. వేలాల్లో జీతాలు తీసుకుంటూ అధికారులు నిద్రమత్తులో ఉదయం 10 కి రావడం 11 కి వెళుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే మేము బయట ఉన్నాం. మాకు మీరు ఒక్కరేనా ఊర్లో ఎన్నో కేసులు ఉంటాయంటూ రైతులను బెదిరిస్తూన్నారు. వివిధ రోగాలతో పశువులు చనిపోతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారని రైతులు వాపోతున్నారు. గోపాలమిత్ర, సచివాలయం ఆర్ బి కే సెంటర్ సిబ్బంది అక్కడక్కడ చొరువ చూపుతున్నా చాలిచాలని వైద్యం మాదిరిగా మిగిలిపోయింది. పై స్థాయి అధికారులు అంటూ లేక ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుంది ప్రభుత్వం. ఎన్ని మొట్టకాయలు వేసినా మా పని ఇంతే మా తీరు ఇంతే ప్రతి పనికి ఓ రేటు అంటూ యాదేచ్ఛగా సొమ్ము దోచుకుంటున్నారు. వంద రూపాయలు కూడా అమ్ముకుంటున్నారు. పేరుకు ఇంచార్జ్ పాలన అంతా ఇష్టం వచ్చినట్టు అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రెగ్యులర్ పశు వైద్యాధికారిని నియమించి పశువులను కాపాడాలిసిన అవసరం ఎంతైనా ఉంది.

## ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు



పెనుకొండ మార్చి 16 మనం న్యూస్ : అమరజీవి పొట్టి శ్రీరాములు 123 జయంతి వేడుకలను పెనుకొండ పట్టణంలోని ఆర్య వైశ్య కళ్యాణ మంటపం నందు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా శిరిడి సాయి ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ సుధాకర్ గుప్తా మాట్లాడుతూ... ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం నిరాహార దీక్షలు చేసి ప్రాణాలర్పించారని ,సత్యము ,అహింస మార్గాలనే ఆచరించి స్వాతంత్ర్యం కోసం తన ప్రాణ త్యాగాన్ని చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాడికి నాగరాజు, బక్సం పల్లి రామకృష్ణ, సూర్యనారా యణ, హరీష్, భాస్కర్ ,సుదర్శన్, రాంప్రసాద్ ,సుగుణ శేఖర్ , సంత రాజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## 17పోలీస్ స్టేషన్లలో సిసి కెమెరాలు

- రాష్ట్ర పోలీసుశాఖ టెక్నికల్ సర్వీస్ డి.ఐ.జి పీహెచ్డీ రామకృష్ణ



అనంతపురం. మార్చి 16 మనం న్యూస్ ప్రతినిధి : జిల్లాలోని 17 పోలీస్ స్టేషన్లలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర పోలీస్ శాఖ టెక్నికల్ సర్వీస్ డి.ఐ.జి. పి.హెచ్.డి రామకృష్ణ తెలిపారు. గురువారం అన్ని జిల్లాల పోలీసు అధికారులతో అయన జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.పోలీసు స్టేషన్లలో నూతనంగా సి.సి.కెమేరాలు ఏర్పాటు చేయాల్సిన విషయమై అయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లాలో నూతనంగా మంజూరైన సి.సి.కెమేరాలను 17 పోలీసు స్టేషన్లలో ఏర్పాటు చేయనున్నట్లు అయన తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, డీసీఆర్బీ విశ్వనాథచౌదరి, కమ్యూనికేషన్ సి.ఐ శ్రీకాంత్, టెక్నికల్ ఎస్ఐ సుధాకర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## వడ్డే చలపతి భౌతిక కాయానికి నివాళులర్పించిన వైసీపీ నాయకులు



పెనుకొండ మార్చి 16 మనం న్యూస్ : పెనుకొండ మండల పరిధిలోని అమ్మవారి పల్లి గ్రామంలో వడ్డే చలపతి గుండెపోటుతో మరణించగా వడ్డే చలపతి భౌతిక కాయానికి వైసిపి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు పొగకు రామచంద్ర ,పెనుకొండ టౌన్ కన్వీనర్ బాబు, చందా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## హాల్ టికెట్ కలిగిన విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

- పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి
- మండల ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి శాంతరాజ్



కనేకల్, మనం న్యూస్ : ఈనెల 15వ వ తేదీ నుంచి రాష్ట్రంలో ప్రారంభం అవుతున్నటువంటి ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు వేలాదిమంది కేంద్రాలకు పరీక్షలు నిమిత్తం హాజరు కానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని పరీక్ష కేంద్రాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ కనేకల్ మండల కార్యదర్శి శాంత రాజ్ డిమాండ్ చేశారు. వేసవి కాలం దృష్ట్యా ప్రతి క్లాస్ రూమ్ లో ఫ్యాన్ సౌకర్యాలు కల్పించి ఇందులో భాగంగా పరీక్ష కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం, టాయిలెట్ శుభ్రంగా నియమనిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు రావడం జరుగుతుంది కాబట్టి వెయిటింగ్ హాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. పరీక్ష కేంద్రాలకు 30 నిమిషాలు ఆలస్యం అయినా పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని దాన్ని తప్పకుండా పరీక్ష కేంద్రం అధికారులు పాటిం చాలి దానితోపాటు ఇంటర్ హాల్టికెట్ ఉన్నటువంటి విద్యార్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు విద్యార్థులు పరీక్షలు విజయవంతంగా కొనసాగేందుకు కృషి చేయాలని కోరారు.

# యువ గళం పాదయాత్రను జయప్రదం చేయండి

- కదిరి గుర్తుండిపోయేలా పాదయాత్రను విజయవంతం చేద్దాం
- నియోజవర్గంలో నాలుగు రోజులు నారా లోకేష్ పాదయాత్ర
- కదిరి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



కదిరి, మార్చి 16, మనం న్యూస్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి భవిష్యత్తు యువ నాయకుడు నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర ఈనెల 18వ తేదీన కదిరి నియోజవర్గంలో ప్రారంభం కానుందని ఈ పాదయాత్రను కానీ విని ఎరగని రీతిలో నారా లోకేష్ బాబుకు కదిరి గుర్తుండిపోయేలా తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కదిరి తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని. పాదయాత్రలో వైకాపా చేస్తున్న అరాచకాలను ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు.

### వైకాపా అరాచక పాలనపై ప్రజల ను చైతన్యవంతులన్నీ చేయడమే లక్ష్యంగా పాదయాత్ర

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పాదయాత్ర ఈనెల 18 న కదిరి నియోజకవర్గంలో ప్రారంభం కానుంది. రాష్ట్రంలో అధికార వైసీపీని ఓడించే లక్ష్యంతో నారా లోకేష్ పాదయాత్ర చేపడుతున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలుపుతున్నారు.ఏడాదికి పైగా సాగే యాత్రలో రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు వేల కిలోమీటర్ల పొడవున లోకేష్ పాదయాత్ర సాగనుంది. అందులో భాగంగా శ్రీ అన్నమయ్య జిల్లా మొలకల చెరువులో పాదయాత్ర ముగించి శ్రీ సత్య సాయి జిల్లా తనకల్లు మండల పరిధిలోని చీకటిమనీ పల్లి వద్దనుండి పాదయాత్ర ప్రారంభం కానుంది. రాష్ట్రంలో అరాచక పాలన పై ప్రజలను చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా నారా లోకేష్ యువ గళం పేరుతో యాత్ర చేపట్టడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో జోష్‌లో ఉన్నారు. పాదయాత్రకు సంఘీభావం తెలిపేందుకు జిల్లా నలుమూలల నుంచి తెలుగుదేశం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నందున ఆ దిశగా నియోజకవర్గ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు.

### మొదటిరోజు యువ గళం పాదయాత్ర షెడ్యూల్

ఈనెల 18 శనివారం న కదిరి నియోజవర్గంలో చీకటి మానిపల్లి వద్ద నుండి లోకేష్ పాదయాత్ర చేపడుతున్నట్లు ఆ పార్టీ శ్రేణులు తెలిపారు. 18వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు పాదయాత్ర ప్రారంభమై 8 గంటల 45 నిమిషాలకు గంగసానిపల్లి వద్ద టమోటా రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు.9.30 నిమిషాలకు బిషనవారిపల్లి లో బలిజ సోదరులతో సమావేశం,10.25 నిమిషాలకు కొక్కంటి క్రాస్ వద్ద స్వాగత కార్యక్రమం, గంటపాటు విరామం అనంతరం12.15 నిమిషాలకు కొక్కంటి క్రాస్ కు చేరుకోనున్నారు. అనంతరం 1.15 నిమిషాలకు ఎస్టి కమ్యూనిటీతో సమావేశం. ఆ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలపై చర్చిస్తారని సమాచారం. మూడు గంటలకు తనకల్లు మండల సమీపంలో స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేశారు. 4.30 నిమిషాలకు తనకల్లు మండల కేంద్రంలో ఎస్సీలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం నల్లచెరువు మండల పరిధిలోకి యాత్ర కొనసాగుతుందని ఆ పార్టీ శ్రేణులు తెలుపుతున్నారు.

### రెండో రోజు పాదయాత్ర షెడ్యూల్

నల్లచెరువు మండల పరిధిలోని చిన్న పల్లోలపల్లి వద్ద నుండి రెండో రోజు లోకేష్ పాదయాత్ర ప్రారంభం కానున్నట్లు ఆ పార్టీ శ్రేణులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల 30 నిమిషాలకు సంజీవ్ పల్లి వద్ద భారీగా స్వాగత కార్యక్రమ ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం నల్లచెరువు మండల కేంద్రంలో చేనేత కార్మికులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి వారు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలపై చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అనంతరం పాదయాత్ర కొనసాగిస్తూ ప్రజలతో మమేకమైతు వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు.

### 600 కిలోమీటర్ల మైలురాయి ప్రారంభం

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర 600 కిలోమీటర్ల మైలురాయి ప్రారంభం నల్లచెరువు మండల పరిధిలోని పాత స్టేషన్ వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు శ్రేణులు తెలుపుతున్నారు. అనంతరం రాట్నాల పల్లెలో కురుబ కులస్తులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. అనంతరం జోగన్నపేట వద్ద భారీ బహిరంగ సభ ఆ సభలో లోకేష్ మాట్లాడునున్నారు. ఆరోజు జోగన్నపేటలో బస చేయనున్నారు.

### మూడవరోజు పాదయాత్ర షెడ్యూల్

జోగన్నపేట వద్ద నుండి మూడవరోజు పాదయాత్ర ప్రారంభం కానున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు కదిరి రూరల్ మండలం పరిధిలోని మోటుకు పల్లి వద్దకు చేరుకోనుంది. అనంతరం అనాథలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు.10.20 నిమిషాలకు బీసీ కమ్యూనిటీలతో సమావేశం ఏర్పాటు చేసి వైకాపా ప్రభుత్వంలో బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై చర్చిస్తారని ఆ పార్టీ శ్రేణులు తెలుపుతున్నారు. భోజన విరామం తర్వాత పి ఆర్ గ్రాండ్ హోటల్లో ముస్లిం, మైనార్టీ సోదరులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 4.20 నిమిషాలకు జీవిమాను సర్కిల్ వద్ద స్వాగత కార్యక్రమం 4.45 నిమిషాలకు ఎంజి రోడ్‌లో బంగారు వ్యాపారులు, స్వర్ణకారులతో ముఖాముఖి కార్యక్రమం. సాయంత్రం ఐదు గంటలకు శ్రీమత్ ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వామివారి దర్శనం.5.45 నిమిషాలకు కోనేరు సర్కిల్ వద్ద స్థానికులతో మాట్లాడునున్నారు. అక్కడి నుండి పాదయాత్ర కొనసాగిస్తూ ఆర్డిఓ ఆఫీస్ ఎదురుగా బస చేయనున్నట్లు ఆ పార్టీ శ్రేణులు తెలిపారు.

### నాలుగవ రోజు పాదయాత్ర షెడ్యూల్

నాలుగవ రోజు లోకేష్ యువ గళం పాదయాత్ర ఉదయం 8 గంటలకు ఆర్డిఓ ఆఫీసు నుంచి ప్రారంభమై 8.15 నిమిషాలకు గృహ లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేయనున్నారు.8.45 నిమిషాలకు అల్లీపూర్ తాండ వద్ద స్వాగత కార్యక్రమం. అక్కడినుండి పాదయాత్ర కొనసాగిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.10.40 నిమిషాలకు ముత్యాల చెరువు వద్దకు పాదయాత్ర చేరుకుంటుందని పార్టీ శ్రేణులు తెలిపారు. అనంతరం పుట్టపర్తి నియోజవర్గంలోకి పాదయాత్ర అడుగుపెట్టనుంది దీంతో కదిరి నియోజకవర్గం లో పాదయాత్ర పూర్తి అవుతుందని ఆ పార్టీ శ్రేణులు తెలుపుతున్నారు.

### వైకాపా అరాచకాలను ప్రజలకు వివరిస్తాం

లోకేష్ యువ గళం పాదయాత్రలో వైకాపా ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలకు పూర్తిస్థాయిలో వివరిస్తామని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తెలుపుతున్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ అన్ని వర్గాలను నిండా ముంచేశారని ఆరోపించారు. ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వచ్చే రోజుల్లో వైకాపాకు గట్టిగా బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

### వైకాపా అరాచక పాలనపై ప్రజలను చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా పాదయాత్ర

వైకాపా ప్రభుత్వ అరాచక పాలనపై ప్రజలను చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా పాదయాత్ర సాగుతుందని ఆ పార్టీ శ్రేణులు తెలుపుతున్నారు. లోకేష్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిస్థాయిలో తెలుసుకొని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తారని తెలిపారు. ఈ పాదయాత్రను విజయవంతం చేసి రాష్ట్రంలోనే కదిరికి ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా ప్రతి కార్యకర్త ప్రతి తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# విద్యార్థులకు భవిష్యత్ అంశాలపై అవగాహన

- స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్



డి. హీరెహాల్ మనం న్యూస్ : స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ అధినేత ఇదా శామ్యూల్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని స్థానిక మహాత్మ జ్యోతిరావు బాపూలే బాలికల హైస్కూల్ నందు స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కావలి ఈశ్వర్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల భవిష్యత్ తరానికి మొదట అడుగు పునాది లాంటి పరీక్షలో ఫెయిల్ అయ్యామని, ఇంట్లో అమ్మ నాన్న తిట్టారని, పరీక్షలు బాగా రాయలేదని, ప్రేమ విఫలయం అయిందని, ఇలా రకరకాల కారణాలతో ఆత్మహత్య చేసుకున్న పలు వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగానే స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ తరపున మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల హైస్కూల్ నందు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎగ్జామినేషన్ దృష్ట్యా ముందస్తుగా కళంలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షతగా మహాత్మ జ్యోతిరావు పూలే ప్రిన్సిపల్ నారాయణ స్వామి,డి. హిరేహళ్ మండలం మడేనల్లి హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.రజియా బేగం, హై స్కూల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుండి భాషపై పట్టు సాధించాలి



పాకాల, మార్చి 16,మనం న్యూస్: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుండి భాష పై పట్టు సాధించాలని పాకాల మండల విద్యా శాఖాధికారి బాబ్జి అన్నారు.ఆయన గురువారం మండలంలోని పొలిశెట్టిగారి పల్లి,పత్తిపాటి వారిపల్లి ,పదిపుట్ల బయలు తదితర పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్న తనం నుండే తెలుగు భాష పట్ల మక్కువ చూపేటట్లు ఉపాధ్యాయులు మెళుకువలు నేర్పించాలని అన్నారు.ఉపాధ్యాయులు ప్రతి రోజూ ఏదో ఒక వేమన పద్యం గానీ, సుమతి పద్యం గానీ ప్రార్థనా సమయంలో విద్యార్థుల చేత చెప్పించాలని అన్నారు.పాఠశాలలకు సరఫరా చేసిన గ్రంథాలయ పుస్తకాలు విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా వేరుచేసి రీడింగ్ పీరియడ్ లో విద్యార్థుల చదివించాలని అన్నారు.ప్రతి పాఠం అయిన తర్వాత దానికి సంబందించిన వర్క్ బుక్స్ ను పిల్లల చేత రాయించి వాటిని ఉపాధ్యాయులు దిద్దాలని తెలిపారు. గణితంలో 20 వరకు ఎక్కాలు వచ్చేటట్లు చూడాలని అన్నారు.మరుగుదొడ్లు రోజుకు 3 పర్యాయాలు శుభ్రం చేయాలని ,వాటి ఫోటోలను సంబంధిత యాప్‌లో అప్లోడ్ చేయాలని అన్నారు. ఉపాధ్యా యులు లెస్సన్ ప్లాన్ రాసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు రెడ్డెమ్మ, ప్రమీలమ్మ, ఉపాధ్యాయులు వెంకటా చలం, సరిత కుమారి, ఆసియా, మోహన్, ఉదయ్ కుమార్, సి.ఆర్.పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



కూడేరు మార్చి 16 (మనం న్యూస్): మండల పరిధిలోని కరుట్లపల్లి గ్రామంలో స్థానిక ఆర్డీటి పాఠశాల మైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా మొదటగా మహిళలందరూ గ్రామం మొత్తం మహిళల ఐక్యతను చాటుతూ ర్యాలీ చేశారు.ర్యాలీ తర్వాత జరిగిన సభలో మహిళలచే నిర్వహించబడిన సంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం సభలో ఆర్డీటి సంస్థ మహిళకు, గ్రామానికి చేసిన అభివృద్ధి, ఆర్థిక సేవలను జన్నే లలిత అనే మహిళ వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన కన్స్ట్రక్షన్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మహిళల సాంస్కృతిక, రాజకీయ మరియు సామాజిక ఆర్థిక విజయాలను స్మరించుకునే రోజులను ప్రపంచ వ్యాప్తంగా మార్చి నెలను మహిళా చరిత్ర నెలగా గుర్తించబడిందని, ఈ రోజు లింగ సమాన ప్రపంచానికి పిలుపునిస్తుందని, పక్షపాతం, వివక్ష లేనిదని, విభిన్నమైన మరియు సమానమైనదనే కలుపుకొని తేడాలుగల విలువైన రోజని అందుకే ప్రతి ఒక్క మహిళా స్వేచ్ఛగా జరుపుకునేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ ఏరియా టీమ్ లీడర్ నల్లపరెడ్డి, సీఓ వన్నూరుస్వామి, 1098 సురేష్, మరియు గ్రామ సర్పంచ్ ఓబుళమ్మ, సీబీటీలు రమణ, అక్కమ్మ, కళాకారులు ఈశ్వర్, ఎర్రిస్వామి,సీడీసీలు శ్రీలత, లత మంజుల, చెక్కిరమ్మ, జ్యోతి, నరసోజమ్మ,గంగమ్మ పాల్గొన్నారు.

## ప్రతిభకు ప్రత్యేక అభినందనలు







తొట్టంబేడు, మార్చి 16, మనం న్యూస్: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ఛైర్మన్ యల్లంపాటి కోటేశ్వర బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి ప్రతిభకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. భారత రాజధాని ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటరులో బుధవారం జరిగిన ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవ వేడుకల్లో యల్లంపాటి కోటేశ్వరబాబు, కలవగుంట భరత్ రెడ్డిని ప్రత్యేకంగా సన్మానం చేశారు. వీరిద్దరూ ఎన్ సీఆర్ సీలో బాధ్యతలు తీసుకున్న అనతి కాలంలోనే వినియోగదారులు తరపున 43 కేసులు నమోదు చేయించడంతో పాటు... వీరు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవ వేడుకల్లో అతిరథ మహారథుల మధ్య సన్మానం చేశారు. కోటేశ్వరబాబు, భరత్ రెడ్డి ప్రతిభను... అంకితభావాన్ని గుర్తించి సన్మానం చేసి జ్ఞాపిక అందచేస్తున్నట్లు నిర్వాహకులు సభాముఖంగా తెలియచేశారు. వీరిద్దరూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వారందరూ ఆకాంక్షించారు.
శ్రీకాళహస్తి ఖ్యాతిని దేశ స్థాయిలో చాటి చెప్పిన కోటేశ్వరబాబు, కలవగుంట భరత్ రెడ్డి ప్రతిభను, కృషిని, అంకిత భావాన్ని అభినందిద్దాం.

# అప్పుల బాధలు తట్టుకోలేక యువరైతు ఆత్మహత్య

కూడేరు, మార్చి 16 (మనం న్యూస్): మండల పరిధిలోని కలగళ్ల గ్రామంలో అప్పుల బాధలు తట్టుకోలేక యువరైతు మీనుగా సంజీవ బలవన్మరానికి పాల్పడ్డాడు వివరాల్లోకెళితే కలగల గ్రామంలో మీనుగ పెద్దన్న మీనుగా ఓబులమ్మ ఇద్దరు కుమారులున్నారు పెద్ద కుమారుడు పెన్నోబులేసు రెండవ కుమారుడు రెండవ కుమారుడు సంజీవ(30)వీరికి ఐదు ఎకరాల భూమి ఉంది నీరు తక్కువ ఉన్నప్పటికీ ఉన్న నీటితోనే వేరుశెనగ సాగు చేస్తూ జీవనం సాగిస్తుండేవారు ఇందులో భాగంగా వచ్చిన పెట్టుబడితోని 500 బత్తాయి చెట్లు కూడా నాటారు పెట్టుబడి పెరగడంతో అప్పులు పెరిగాయి దీనితో కుటుంబ పోషణ భారంగా పెరిగిపోయింది మీనుగా సంజీవకు మాధవి( భార్య) ఇద్దరు కూతుర్లు ఉన్నారు పెద్ద కూతురు సింధు (7) చిన్న కూతురు హేమశ్రీ(4) ఉన్నారు ప్రస్తుతం సంజీవ భార్య మాధవి 7 నెలల నిండు చూలాలు గత నాలుగే సంవత్సరముల నుంచి వేరుశెనగ సాగు చేస్తున్న ఆశాజనకంగా పంట రాకపోవడంతో అప్పులు ఎక్కువయ్యాయి ఈ క్రమంలో దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు గత పది రోజుల నుంచి ఎవరితో మాట్లాడకుండా తనలో తానే కుమిలిపోయాడు ఇక తను చాలించాలనే గట్టి నిర్ణయం తీసుకున్నాడు ఇందులో భాగంగా 11వ తేదీ ద్విచక్ర వాహనంలో పెనకచర్ల డ్యాం ఫారెస్ట్ వైపు వెళ్ళాడు



బండి దారిలో ఉంచి వెళ్లిపోయాడు కుటుంబ సభ్యులు తన జాడ తెలియక పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేస్ నమోదు చేశారు 15వ తారీఖు మధ్యాహ్నం 11 గంటల సమయంలో డ్యాం ఫారెస్ట్ నందు గొర్రెల కాపరులు ద్విచక్ర వాహనం లో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా వారి బంధువులు ఉన్న కలగళ్ల గ్రామంలో వాహనం ఉన్నట్టు బంధువులకు సమాచారం అందించారు 16వ తేదీ ఉదయం హుటాహుటిన డ్యాం ఫారెస్ట్ అంతా బులోరా వాహనంలో గాలించగా అడవిలో ఒక చెట్టుకు ఉరివేసుకొని విగతజీవిగా పడి ఉన్న కుమారుని చూసి తండ్రి నేనుగా పెద్దన్న గుండె పగిలేలా రోదించాడు

ఈ విషయం తెలుసుకున్న కలగల గ్రామంలో విషాద ఛాయాలనుకున్నాయి కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల మేరకు తమకు తెలిసి ఐదు లక్షల మేర అప్పుందని తమతో చెబుతూ ఉండేవాడని ప్రతిరోజు దీని గురించి బాధపడేవాడని చెప్పారు తమకు తెలియకుండా అప్పు చేసి ఉంటాడని ఈ అప్పు ఎలా తీర్చాలని మనోవేదనే ఎక్కువై ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు నాలుగు రోజులుగా కనపడిన నాన్న ఎప్పుడెప్పుడు వస్తాడని చూస్తున్న ఆ కూతుర్లను భార్య మాధవిని ఓదార్చడం ఎవరి వల్ల కావడం లేదు ఊరు ఊరంతా కన్నీటి పర్యంతమయ్యారు.

## సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి..

**- మున్సిపల్ కమిషనర్**



ధర్మవరం. మార్చి 16 మనం న్యూస్ ధర్మవరం పురపాలక సంఘము నకు చెల్లించాల్సిన పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున కోరారు. గురువారం అయన విలేకర్లతో మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరం మార్చి నెలాఖరుతో ముగుస్తున్నందున ఇంటి పన్నులు, నీటి పన్నులు, ఖాళీ స్థలం పనులు, ట్రేడ్ లైసెన్సులు, అడ్వర్టైజ్మెంట్ పన్నులను పట్టణంలో నెలకొల్పబడిన కేంద్రాలలో చెల్లించి రసీదు పొందాలన్నారు. ఈ నెలాఖరులోగా పన్నులు చెల్లించాలన్నారు. చెల్లించని వారు సంవత్సరానికి 24 శాతంతో అపరాధ రుసుము చెల్లించవలసి ఉంటుందన్నారు. అదేవిధంగా ఎక్కువ మొత్తంలో బకాయిలు ఉన్నవారి కొళాయి కనెక్షన్లు తొలగించి, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.చెల్లించ వలసిన మునిసిపల్ పన్నులను ఆన్లైన్ లో గాని, మున్సిపల్ ఆఫీస్ లోని కౌంటర్ లో చెల్లించ వచ్చునన్నారు. ప్రజల సౌకర్యార్థం పార్థసారధి నగర్-2 సచివాలయం, ఎల్పీ సర్కిల్, గీతా నగర్ సచివాలయంలలో కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు..కావున పట్టణ ప్రజలు సహకరించి పన్నులు చెల్లించాలని కమీషనర్ కోరారు.

## బహిర్గత మలవిసర్జన రహిత పంచాయతీగా తీర్చిదిద్దాలి



అగలి, మార్చి 16, మనం న్యూస్: మండల పరిధిలోని ఇరిగేపల్లి గ్రామ పంచాయతీ ను బహిర్గత మల విసర్జన రహిత(ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ ప్లస్) గ్రామ పంచాయతీ గా, పరిశుభ్ర గ్రామ పంచాయతీ గా తీర్చిదిద్దుటకు, అన్ని రకాల ఘన, ద్రవ వ్యర్థ రహిత గ్రామము గా ఏర్పాటు చేయుటకు, ప్రజలు పాటించవలసిన పద్ధతులపై న మరియు ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చుదిద్దుటకు, తమ వంతు ప్రజా ఆర్థిక విరాళాల సహకారంతో మరి యు ప్రజా భాగస్వామ్యం తో స్వచ్ఛ గ్రామం గా మరియు 100% మరుగు దొడ్డి వినియోగించడం ద్వారా ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ ప్లస్ గ్రామంగా ఏర్పాటు చేయడం పై గ్రామ పంచాయతీ పరిధిలోని పాఠశాల లను సంద ర్శించి మరుగుదొడ్ల వినియోగం మరియు స్వచ్ఛత పై స్వచ్ఛ భారత్ మిష న్ కో ఆర్డినేటర్ సునీత, అనంత్ అవగాహన కార్యక్రమం ను గ్రామ పంచా యతీలోని వాలంటీర్ల కు, మరియు స్వచ్ఛత పారిశుధ్య సిబ్బందికి ఏర్పాటు చేయడం జరిగింది.విస్తరణ అధికారి శ్రీమతి పద్మ, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, సచివాలయం సిబ్బంది గణేష్, రంగ రాజు, ఇరిగేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వాలంటీర్లు పాల్గొనడం జరిగింది..

## అమరజీవి పొట్టి శ్రీరాములు

# ఆశయ సాధనకు కృషి చేస్తాం

ధర్మవరం మార్చి 16 మనం న్యూస్ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు కృషి చేస్తామని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కలవల రామ్ కుమార్ తెలిపారు. గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతి సందర్భంగా స్థానిక వాసవి సర్కిల్ లోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి జిల్లా ఆర్యవైశ్య సంఘం, పట్టణ ఆర్యవైశ్య సంఘం అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కలవల రాంకుమార్ మాట్లాడుతూ తెలుగు భాషా సంయుక్త రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు తన ప్రాణాలను సైతం అర్పించిన మహనీయుడు అన్నారు. అలాంటి మహనీయుని ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు పట్టుదలకు నిలువెత్తు నిదర్శనం అన్నారు. ప్రత్యేక రాష్ట్రం సాధించేంతవరకు పొట్టి శ్రీరాములు చేసిన పోరాటాలు మరువలేని అన్నారు. చివరకు తన ప్రాణాలను తృణప్రాయంగా భావించి ఆమరణ నిరాహార



దీక్ష చేసి తెలుగు వారందరికీ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన ఘనత పొట్టి శ్రీరాములు కే చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారి రేపాకుల సురేష్ బాబు, జాయింట్ సెక్రెటరీ గ్రంథే శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ పెనుజూరు నాగరాజు, పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి భీమిశెట్టి కృష్ణమూర్తి, కోశాధికారి ఓవి ప్రసాద్, వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు పోల మడ రూపా రాగిణి, నల్లపేట మంజు సంయుక్త, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు అంబటి అవినాష్, ఆవోపా సత్యసాయి జిల్లా ఇంచార్జ్ అన్నా లక్ష్మీనారాయణ, ఆవోపా పట్టణ అధ్యక్షులు డాక్టర్ శీభా నగేష్ గుప్తా, కలవల కిషోర్, దోరణాల ఫణి రాజ్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్తుల పరిధిలోనే సూర్యనారాయణ స్వామి ఆలయం



ఉరవకొండ, మార్చి 16, మనం న్యూస్: మండలంలో గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయం ఇటీవల దేవాదయ శాఖ పరిధిలోకి తీసుకున్నారు. దీన్ని సవాల్ చేస్తూ గ్రామస్తులు, సూర్యనా రాయణ స్వామి సేవ సమితి ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించారు. స్పం దించిన హైకోర్టు దేవాదాయ శాఖ పరిధిలోకి చేర్చిన ఉత్తర్వులను రద్దు చేసి నట్లు శ్రీ సూర్యనారాయణ స్వామి సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. ఇ ప్పటి నుంచి ఆలయంలో కార్యక్రమాలను గ్రామ ప్రజలు, సూర్యనారాయణ స్వామి సేవా సమితి ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించాలని తెలిపింది. హైకోర్టు తీర్పు పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి

ఉరవకొండ, మార్చి 16, మనం న్యూస్: ఆంధ్ర రాష్ట్ర సాధనకు ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు 122వ జయంతి వేడుకలు గురువారం ఉరవకొండలో ఘనంగా జరిగాయి.గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్ద సర్పంచ్ మీనుగా లలిత, ఎంపీపీ చందా చంద్రమ్మ,పార్టీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, వార్డు సభ్యుడు నిరంజన్ గౌడ్, కో అప్షన్ సభ్యులు పామిడి సలీమ్,ఈఓ గౌస్ తదితరులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు ప్రాణత్యాగంతోనే ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించుకోగలిగామని,ఆయన త్యాగాన్ని ఎవరు మరువలేనిదని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఓబన్న, నిర్మలమ్మ, మైనారిటీ నాయకులు పామిడి జాకీర్, మద్దికెర అన్వర్, తాజుద్దీన్,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నీటి సమస్య తీర్చిన గ్రామ సర్పంచ్



అగలి మార్చి16 మనం న్యూస్ అగలి మండ లంలోని మధుడి గ్రామంలో 5 సంవత్సరం నుండి ఎవరూ పట్టించుకోని సమస్యను సర్పం చ్ ప్రజల సమస్యను పరిష్కరించారు....బీసీ కాలనీ వాసులు ఏనో ఏండ్లుగా నీటి ఇబందులు ఎదుర్కొన్నారు. కానీ సమస్యను సర్పంచ్ దృ ష్టికి గ్రామ వాసులు తీసుకొని పోగా ....సర్పంచ్ వెంటనే స్పందించి .... వారికీ సొంత నిధులతో పైప్ లైన్ చేయిచడం జరిగినది గ్రామ ప్రజలు సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు


## విద్యార్థి లోకేష్ కుటుంబానికి అండగా నిలిచిన మధూడి పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు



అగలి మార్చి 16 మనం న్యూస్ అగలి మండలం మధుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవలే ఈతకు వెళ్ళి మరణించిన 10 తరగతి విద్యార్థి లోకేష్ కుటుంబానికి అండగా నిలిచిన మధుడి పాటశాల ప్రధాన ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యా యులు, సి ఆర్ పి సిబ్బందతోపాటు విద్యార్థులు అందరు తమ వంతుగా సుమారు 41500,రూపాయలను విద్యార్థి తల్లికి ఇచ్చి అండగా నిలిచారు. మదుడి పాటశాల విద్యార్థినిని, విద్యార్థులు సిబ్బంది, మానవత్వానికి గ్రామ ప్రజలు కృతజ్ఞత తెలిపారు

## సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమం ఆగదు

ఉరవకొండ, మార్చి 16, మనం న్యూస్: ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల్లో రూ.3వేల కోట్లు ఈ నెల 31లోపు చెల్లిస్తామని ఉద్యోగ సంఘాల నాయకులకు మంత్రుల కమిటీ హామీ ఇచ్చిందని, అయితే ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యోగుల పోరాటం కొనసాగుతుందని ఉరవకొండ డిప్యూటీ తహసిల్దార్ గురుప్రసాద్ తెలిపారు. అ్క ఒఅఇ అమరావతి పిలుపు మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ ఉద్యోగులు తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సి ఎస్ డీ టి రమేష్, వీఆర్వోలు, తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం..

ఉరవకొండ, మార్చి 16, మనం న్యూస్: పట్టణంలోని స్థానిక బాలాజీ సినిమా థియేటర్ ఎదురుగా విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం అయ్యింది. గురువారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో ఆంజనేయులు ఇంటిలో ఒక్కసారిగా వైర్లలో నుండి మంటలు వచ్చి ఇల్లు మొత్తం

# ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతోత్సవం

**- ఆధునిక శిబిచక్రవర్తి అమరజీవి**

**- జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్**

సత్యసాయి జిల్లా ప్రతినిధి , మార్చి16 మనం న్యూస్ అమర జీవి పొట్టి శ్రీరాములు ఒక గొప్ప త్యాగ మూర్తి, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆద్యుడు మహనీయుడు అని జిల్లా కలెక్టర్ బసంత కుమార్ పేర్కొన్నారు గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికిపుష్పాంజలి ఘటించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16 న జన్మించి 1952 డిసెంబరు 15న అమరులయ్యారని అన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి, అమరజీవి యైన మహాపురుషుడని ఆయన త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్రం 1956 నవంబర్1 న ఏర్పడిందని అన్నారు. పొట్టి శ్రీరాములు 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించాడని, తర్వాత మళ్ళీ 1941-42 సంవత్సర కాలంలో సత్యాగ్రహాలు, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొనడం వల్ల మూడుసార్లు జైలుశిక్ష అనుభవించాడని అన్నారు. ఆంధ్రులకు భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణ భూతుడైనవారని, మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాలకొరకు జీవితాంతం



కృషిచేసిన మహనీయుడని కొనియాడారు. ఈ మహనీయుని జ్ఞాపకార్థం రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించిందని, నెల్లూరు జిల్లా పేరును 2008లో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా మార్చారని, అమరజీవి పొట్టి శ్రీరాములు గౌరవార్ధం తపాల శాఖ వారు 2000 మార్చి 16 లో ఒక ప్రత్యేక తపాల బిళ్ళను విడుదల చేసారని, మహనీయుల జయంతి వర్ధంతి కార్యక్రమాల ద్వారా వారి జీవిత విశేషాల నుండి స్ఫూర్తి పొంది యువత సన్మార్గంలో దేశ భక్తితో మెలగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టూరిజం అధికారి ప్రతాప్ కలెక్టరేట్ కార్యాలయం ఏవో వెంకటనారాయణ, తహసీల్దార్ అనుపమ, డిప్యూటీ తహసీల్దార్ మైనావుద్దీన్ ఇతర సెక్షన్ల సూపర్డెంట్లు తదితరులు పాల్గొన్నారు

# కమిషన్ల కోసమే డిజైన్‌లు మారుస్తున్నారు

**బీఆర్ఎస్ అక్రమాలు, అరాచకాలు పెరిగాయ్**
**బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఓ ఇసుక దొంగ, బియ్యం దొంగ**
**సాగు, తాగు నీరు అందించింది కాంగ్రెస్ ప్రభుత్వమే**
**టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి**



బోధన్, మార్చి 16 (మనం న్యూస్): తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంక కమిషన్లకు కక్కుర్తి పడి ప్రాజెక్టుల డిజైన్లు మారుస్తున్నారని టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆరోపించారు. గురువారం బోధన్ నియోజకవర్గం లోని ఎడపల్లి నుంచి బోధన్ అంబేద్కర్ చౌరస్తా వరకు హాత్ సే హాత్ జోడో పాదయాత్ర కొనసాగింది. ఈ పాదయాత్ర బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీమాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర ఇందులో భాగంగానే ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై భ్రమలు కల్పించి కేసీఆర్ మార్కెటింగ్ చేసుకొని ప్రజలకు మాయమాటలు చెప్పే ప్రయత్నం చేస్తున్నాడని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే సాగు తాగు నీటి అవసరాలు తీర్చేందుకు జలయజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. ఇందులో భాగంగా ప్రాణహిత చేవెళ్ల డిజైన్ చేశామని ఆయన గుర్తు చేశారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో 9 వ ప్యాకేజి పనులు ఆపేశారని, దీనికి కేటీఆర్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రస్తుతం కేసీఆర్ ప్రభుత్వం రీ డిజైన్ పేరుతో ధన దాహం కోసం అంచనాలు పెంచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ఎత్తిపోతల పథకాలను కేసీఆర్ తిప్పి పోత పథకాలుగా మార్చారని ఆయన అన్నారు. కేసీఆర్ దోపిడీకి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు బలైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో జరగని వివక్ష నేడు తెలంగాణలో జరుగుతోందని ఆయన ఆరోపించారు. ప్రాజెక్టులకు మేలు చేయాలని ఉద్దేశం ఉంటే కేసీఆర్ కుటుంబం వద్దేనే ఇరిగేషన్ శాఖ ఎందుకు ఉందని ఆయన ప్రశ్నించారు. ప్రాజెక్టుల పేరుతో అడ్డగోలుగా కమిషన్లు వసూలు చేసుకోవాలని ఉద్దేశంతో తన కుటుంబం వద్దే ఇరిగేషన్ శాఖ పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ పాదయాత్రలో ఆయన వెంట మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి జిల్లా అధ్యక్షుడు మానల మోహన్ రెడ్డి, బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, కాసుల బాలరాజ్‌తో పాటు బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**నిజామాబాద్**

బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఓ ఇసుక దొంగ, బియ్యం దొంగ బోధన్‌లో కాంగ్రెస్ కార్నర్ మీటింగ్‌లో టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రెచ్చిపోయి బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమేర్ ఓ ఇసుక దొంగ.. ఓ బియ్యం దొంగ అని ఆరోపించారు. గురువారం రాత్రి బోధనలన్నీ అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన కాంగ్రెస్ కార్నర్ మీటింగ్లో ఆయన మాట్లాడారు. రోజురోజుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరాచకాలు అక్రమాలు పెరిగిపోయాయని ఆయన ఆరోపించారు. ఏం తప్పులు చేశారని గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించారని ఆయన ప్రజలను ప్రశ్నించారు. రెండుసార్లు ఎమ్మెల్యే అయినా ముస్లిం రిజర్వేషన్ల కోసం ఎమ్మెల్యే షకీల్ ఏనాడైనా అసెంబ్లీ లో మాట్లాడారా అని ఆయన ప్రశ్నించారు. సిద్దిపేట్, సిరిసిల్ల, గజ్వేల్‌లో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్స్ మిగితా చోట్ల ఎందుకు పూర్తికావడం లేదని, ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో ఇరిగేషన్, విద్యుత్ ప్రాజెక్టులు విద్యాసంస్థలు కాంగ్రెస్ పాలనలో ఏర్పడ్డవే అని ఆయన గుర్తు చేశారు. పిట్లం సభలో కేటీఆర్ అవగాహన లేకుండా మాట్లాడారని ఆయన ఎద్దేవా చేశారు. మేము తెలంగాణ ఇస్తేనే మీరు మంత్రులయ్యారని,

లేకుంటే మక్కా మసీదు వద్ద అడుక్కు తినేవారని ఆయన అన్నారు. ప్రజలు మంచి మనసుతో ఒక్కసారి కాంగ్రెస్ పార్టీకి ఛాన్స్ ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్నర్ మీటింగ్లో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి జిల్లా అధ్యక్షుడు మాలనమోహన్ రెడ్డి బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తోపాటు బోధన్ నియోజకవర్గ ఇన్చార్జిలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లాలో వడగండ్ల వాన

**వరి ఇతర కూరగాయల వంటలకు భారీ నష్టం**



వికారాబాద్, మార్చి 16, మనం ప్రతినిధి: వికారాబాద్ జిల్లాలో వడగండ్ల వాన భీకరంగా కురిసింది. గురువారం మధ్యాహ్నం 2-3 గంటల సమయంలో వికారాబాద్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో కురిసింది. జిల్లా కేంద్రం వికారాబాద్ తో పాటు మరుపల్లి ప్రాంతాల్లో వర్షం కురిసింది. జిల్లాలోని మర్పల్లిలో అరగంట పాటు ఈ వడగండ్ల వర్షం పడింది. జార్ఖండ్ నుంచి ఛత్తీస్గఢ్ మీదుగా తెలంగాణ వరకు ఉన్న ద్రోణి ప్రభావం వల్ల రాష్ట్రంలోని పలు జిల్లాలలో వడగండ్ల వర్షం, మెరుపులు, మోస్తారు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించిన విషయం విధితమే. ఈ క్రమంలో భీకరమైన వడగండ్లు, మెరుపులతో ఉరుములతో కూడిన వర్షం కురిసింది . మర్పల్లిలో అర్ధగంటకు పైగా వర్షంతో పాటు వడగండ్లు కురిశాయి. దీంతో మర్పల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారులన్నీ వడగండ్లతో నిండుకున్నాయి. భారీ ఎత్తున వడగండ్ల కురవడంతో ప్రజలు ఆశ్చర్యానికి లోనయ్యారు.పెద్ద మొత్తంలో పడిన వడగండ్లతో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్న రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వడగండ్ల వానల వల్ల యాసంగికి సాగు చేస్తున్న వారి పంటకు ఎక్కువ నష్టం కలుగుతుందని అలాగే మామిడి తోటలకు కూరగాయ పంటలకు కూడా నష్టం వాటితోందని రైతులు ఆవిడ వ్యక్తం చేశారు. జిల్లాలో అకాల వర్షాల ప్రభావం మరో రెండు, మూడు రోజులు ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు పగలు, రాత్రి అప్రమత్తంగా ఉండాలని, రైతులు కూడ అప్రమత్తంగా ఉండాలని రెవిన్యూ, వాతావరణ శాఖల అధికారులు సూచించారు.

## ప్రవీణ్ పెన్‌డ్రైవ్‌లో మరో 3 ప్రశ్నపత్రాలు..

**గుర్తించిన ఎఫ్ఎస్ఎల్ అధికారులు**

హైదరాబాద్, మార్చి 16 (మనం న్యూస్): టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. ఏఈ ప్రశ్నపత్రం మాత్రమే లీకైందని గుర్తించిన టీఎస్పీఎస్సీ అధికారులు మార్చి 5న జరిగిన అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) పరీక్షను రద్దు చేసినట్టు ఇప్పటికే ప్రకటించారు. కానీ, ప్రవీణ్ దగ్గర ఉన్న పెన్ డ్రైవ్‌లో ఏఈ ప్రశ్నపత్రంతో పాటు టౌన్‌ప్లానింగ్, వెటర్నరీ అసిస్టెంట్, గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలు కూడా ఉన్నట్టు సిట్ అధికారులు అనుమానించారు. దీంతో ప్రవీణ్ వద్ద ఉన్న సెల్ఫోన్తో పాటు పెన్‌డ్రైవ్‌ను సిట్ అధికారులు స్వాధీనం చేసుకుని ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు. వాటిని విశ్లేషించిన ఎఫ్ఎస్ఎల్ అధికారులు ప్రవీణ్ పెన్ డ్రైవ్‌లో మరి కొన్ని ప్రశ్నపత్రాలు గుర్తించినట్టు సమాచారం. వెటర్నరీ అసిస్టెంట్, టౌన్ ప్లానింగ్, గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలు పెన్డ్రైవ్లో ఉన్నట్టు తెలుస్తోంది. అయితే, దీనిపై టీఎస్పీఎస్సీ అధికారులు కానీ, సిట్ అధికారులు కానీ ఇప్పటి వరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ప్రస్తుతం కేసు దర్యాప్తు దశలో ఉన్నందున ఎలాంటి వివరాలు వెల్లడించినా నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొంటుందని, సమాచారం వెల్లడించడం సాధ్యం కాదని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే 9మంది నిందితులను అరెస్టు చేసి కస్టడీకి తరలించారు. నిందితులను పోలీసు కస్టడీకి తీసుకుని ప్రశ్నిస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని చెబుతున్నారు. నిందితుడు ప్రవీణ్ ఏఈ ప్రశ్నపత్రం రేణుకకు విక్రయించగా.. మిగిలిన ప్రశ్నపత్రాలు ఎవరికి విక్రయించాడనే దానిపై సిట్ అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు.

## నాలుగు రోజులు భారీ వర్షాలు..

**వాతావరణ శాఖ వెల్లడి**

**పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ**



హైదరాబాద్, మార్చి 16 (మనం న్యూస్): రాష్ట్రంలో రాబోయే నాలుగు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ మేరకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఉత్తర - దక్షిణ ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు కురుస్తున్నాయి. 17న నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వానలు పడుతాయని చెప్పింది. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయడంతో పాటు పలుచోట్ల వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మిగతా జిల్లాలో అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురుస్తాయని తెలిపింది. 18న జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, జనగాం, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాలో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

పలుచోట్ల వర్షం

ఉత్తర - దక్షిణ ద్రోణి ప్రభావంతో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తున్నది. వికారాబాద్, సంగారెడ్డి, హైదరాబాద్ జీహెచ్ఎంసీ ప్రాంతాల్లో వడగళ్ల వాన కురుస్తున్నది. హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో చిరుజల్లులు పడుతున్నాయి. గచ్చిబౌలి, యూసుఫ్గూడ, సోమాజిగూడ, అమీర్పేట, కూకట్పల్లి, పంజాగుట్ట, ఖైరతాబాద్, కాటేదాన్, రాజేంద్రనగర్, హయత్నగర్, పెద్ద అంబర్పేటలో జల్లులు వర్షంపడుతున్నది. చేవేళ్ల నియోజకవర్గంలో ఈదురుగాలులు, సంగారెడ్డి సిల్లా సంగారెడ్డి మండలంలో వడగళ్ల వాన, బడంపేట, మనియార్‌పల్లిలో ఈదురుగాలులతో వర్షం కురుస్తున్నది.

## ఎమ్మెల్సీ కవితకు మరోసారి ఈడీ నోటీసులు..

న్యూఢిల్లీ, మార్చి 16: ఢిల్లీ మద్యం కేసులో భారాస ఎమ్మెల్సీ కవితకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 20వ తేదీన వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఈడీ పేర్కొంది. దర్యాప్తులో భాగంగా కవిత ఇవాళ ఈడీ విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. తాను హాజరుకాలేనని అధికారులకు ఈ-మెయిల్ ద్వారా లేఖ పంపిన విషయం తెలిసిందే. మరో రోజు విచారణకు హాజరయ్యేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మరో తేదీని ఖరారు చేస్తూ కవితకు ఈడీ నోటీసులు జారీ చేసింది. మరోవైపు ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న అరుణ్ పిళ్లై కస్టడీ ముగియడంతో ఈడీ అధికారులు రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు.ఈ నెల 16వ తేదీన ఈడీ విచారణకు హాజరుకావాలని ఈడీ నోటీసులు జారీ చేయడంపై కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఒక మహిళను విచారించేందుకు ఈడీ కార్యాలయానికి పిలవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. తమకు ఇచ్చిన నోటీసుల్లో ఇతరులతో కలిపి విచారిస్తామని చెప్పారని.. కానీ అలా చేయలేదని కవిత పేర్కొన్నారు. పిటిషన్ను విచారణకు తీసుకుంటున్నట్లు సీజేఐ ధర్మాసనం తెలిపింది. ఆమె పిటిష్న మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు, తక్షణమే విచారించేందుకు నిరాకరించిన సీజేఐ ధర్మాసనం.. ఈనెల 24న వాదనలు వింటామని స్పష్టం చేసింది. దీంతో సుప్రీం తీర్పునకు ముందే మరోసారి వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని కవితకు ఈడీ నోటీసులు జారీ చేసింది.

అరుణ్ పిళ్లై ఈడీ కస్టడీ పొడిగింపు..

ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న అరుణ్ పిళ్లై కస్టడీ ముగియడంతో ఈడీ అధికారులు ఇవాళ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. ఈడీ వాదనలు వినిపిస్తూ.. ''ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మరికొందరితో కలిపి పిళ్లైని ప్రశ్నించాల్సి ఉంది. 10 రోజుల కస్టడీలో పిళ్లై ముందు హోటల్ రికార్డ్స్, పత్రాలు ఉంచి విచారణ చేశాం. కొందరు నిందితులు, సాక్షులను కలిపి జరుపుతున్న విచారణ ఇంకా పూర్తి కాలేదు. అందుకని ఆ వ్యక్తులను మరోసారి విచారణకు రావాలని ఆదేశించాం. ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవిత ఇవాళ్టి ఈడీ విచారణకు హాజరుకాలేదు. ఈ పరిస్థితుల్లో పిళ్లై కస్టడీ పొడిగించాల్సి ఉంటుంది'' అని ఈడీ కోర్టుకు వివరించింది. వాదనలు విన్న సీబీఐ ప్రత్యేక కోర్టు.. మరో మూడు రోజుల పాటు పిళ్లై కస్టడీ పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## నేరస్తుల్ని కాపాడేందుకు సిట్..

హైదరాబాద్, మార్చి 16 (మనం న్యూస్): టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజ్ వ్యవహారంలో ఐటీ శాఖ విఫలమైందని, ఆ శాఖ మంత్రి కేటీఆర్‌ను పదవి నుంచి తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. నేరస్తులను కాపాడటం కోసమే సిట్ వేశారని ఆరోపించారు. టీఎస్పీఎస్సీని పూర్తిగా రద్దు చేసి.. వారిని ప్రాసిక్యూషన్ చేయాలని కోరారు. ఆ కమిషన్కు తెలియకుండా ప్రశ్నాపత్రం ఎలా లీక్ అయ్యిందన్న ఆయన.. ఛైర్మన్ వద్ద ఉండాల్సిన పాస్వర్డ్ బయటకు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. సిట్టింగ్ జడ్జ్తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అసలు తప్పు చేయనప్పుడు.. సిట్టింగ్ జడ్జ్తో విచారణ ఎందుకు జరిపించడం లేదని నిలదీశారు. టీఎస్పీఎస్సీ నమ్మిన వాళ్లే మోసం చేస్తున్నారని చెప్తున్నారని.. మరి అలాంటప్పుడు ఆ కమిషన్‌కి ఛైర్మన్ ఎందుకని అడిగారు.ఇదంతా సీఎం కేసీఆర్ కొడుకు కేటీఆర్ డ్రామా అని బండి సంజయ్ ఆరోపించారు. తన కొడుకు తప్పు చేస్తే కేసీఆర్ స్పందించరని.. అదే ఇతర మంత్రులు గానీ, ఎమ్మెల్యేలు గానీ తప్పు చేస్తే.. వారిని వెంటనే బర్తరఫ్ చేసేవారని అన్నారు. తన కొడుకు కాపాడుకోవడం కోసం.. ఈ వ్యవహారం వెనుక బీజేపీ కార్యకర్త హస్తం ఉందంటూ కేసీఆర్ సరికొత్త డ్రామాను మొదలుపెట్టారని వ్యాఖ్యానించారు. ఈ మాట అనడగానికి సిగ్గుండాలని మండిపడ్డారు. 2017లో టీఎస్ఎస్ ఉద్యోగిగా పని చేసిన వ్యక్తిని టీఎస్పీఎస్సీలో పెట్టారని పేర్కొన్నారు. ఈ రోజుల్లో ఒక వ్యక్తిని రిక్రూట్ చేసుకోవడానికి ముందు.. చిన్న చిన్న కంపెనీలే ఎంతో బ్యాక్గ్రౌండ్ వర్క్ చేస్తారని, అలాంటిది బ్యాక్గ్రౌండ్ తెలుసుకోకుండానే టీఎస్పీఎస్సీలో ఆ వ్యక్తిని పెట్టారా? అని ప్రశ్నించారు. ఆ వ్యక్తితో ఉన్న ఫోటోని చూపిస్తూ తనకు సంబంధం ఉందని ఆరోపణలు చేస్తున్నారని.. రోడ్డు మీద సిగ్నల్ దగ్గర కూడా తాను ఎంతోమందితో సెల్ఫీలు దిగుతుంటానని కౌంటర్ ఇచ్చారు.

# అదానీ అంశంపై చర్చకు బీఆర్ఎస్ పట్టు




ఖమ్మం, మార్చి 16 (మనం బ్యూరో): నాలుగో రోజు కూడా అదానీ వ్యవహారం పార్లమెంట్ ఉభయ సభలను కుదిపేసింది. అధికార, ప్రతిపక్ష సభ్యుల నినాదాలతో పార్లమెంట్ హోరెత్తింది. బీఆర్ఎస్ , ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులతో చేసిన ఆందోళన నేపథ్యంలో ఉభయ సభల్లో కార్యకలాపాలు స్తంభించిపోవడంతో లోక్ సభ, రాజ్యసభ పలుమార్లు వాయిదా పడి, తిరిగి శుక్రవారానికి వాయిదా పడ్డాయి. అదానీ - హిండెన్ బర్గ్ అంశంపై పార్లమెంట్ లో చర్చించడం తో పాటు జాయింట్ పార్లమెంటరీ కమిటీని వేయాలని కోరుతూ లోక్ సభలో బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు నామ నాగేశ్వరరావు వాయిదా తీర్మానం ఇచ్చారు. ఈ అంశంపై చర్చకు బీఆర్ఎస్ , విపక్ష ఎంపీలు పట్టుబట్టారు.స్పీకర్ వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలతో హోరెత్తించారు.సభ వాయిదా అనంతరం పార్లమెంట్ బయటకు వెళ్లి పెద్దఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అదానీ అంశంపై జేపీసీ వేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో భావ స్వేచ్ఛ లేకుండా పోయిందని,ఎంతో ప్రజా ప్రాముఖ్యం ఉన్న అదానీ, జే పీసీ అంశాలపై పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చించి, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.అదానీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. నాలుగు రోజులుగా పార్లమెంట్ స్తంభిస్తున్నా, వందలాది మంది ఎంపిలు రోడ్ల మీద కు వచ్చి ఆందోళన చేస్తున్నా ప్రధాని మోడీకి పట్టకపోవడం దారుణమన్నారు. అదానీ- హిడెన్ బర్గ్ అంశంపై ఎందుకు చర్చకు అంగీకరించడం లేదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా మోడీ దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చర్చకు అనుమతించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నామ కోరారు.ఈ విషయంలో కేంద్రం దిగి వచ్చేంత వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని నామ స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలను ప్రతిపక్ష పార్టీల నేతలపైకి పంపి దుర్వినియోగం చేయడాన్ని నామ గర్హించారు.

# ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో ర్యాగింగ్ కలకలం

డిచ్‌పల్లి, మార్చి 16 (మనం న్యూస్): నిజామాబాద్ జిల్లాలోని డిచ్ పల్లిలో ఉన్న ప్రైవేటు నర్సింగ్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం రేపింది. గురువారం డిచ్‌పల్లిలోని ప్రైవేట్ నర్సింగ్ కాలేజీలో సీనియర్ విద్యార్థులు ప్రతిరోజు విద్యార్థినుల వ్యక్తిగత వివరాలు చెప్పాలని ర్యాగింగ్ చేయడమే కాకుండా విపరీతంగా టార్చర్ పెడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేయడం వల్ల డిచ్‌పల్లి పోలీసులు ర్యాగింగ్ చేస్తున్న సీనియర్ విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కొందరు విద్యార్థినిలు మీడియాతో మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా సీనియర్లు తమను ర్యాగింగ్ చేస్తున్నారంటూ జూనియర్ ఫార్మసీ విద్యార్థినులు ఆరోపించారు. ర్యాగింగ్ చేస్తూ తమ వ్యక్తిగత వివరాలు బయోడేట కోసం వేధిస్తున్నారని, తప్పని పరిస్థితిలో కలిసికట్టుగా విద్యార్థునుల ఆందోళనకు దిగాల్సి వచ్చిందని వారన్నారు. సీనియర్ల మంటూ జూనియర్లు కచ్చితంగా వ్యక్తిగత వివరాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, నర్సింగ్ కళాశాలకు వస్తున్న విద్యార్థినిలకు చాలా ఇబ్బంది పెట్టేవారని, ప్రపంచ మహిళా దినోత్సవానికి ఆదర్శంగా తీసుకొని మహిళలోకం, మహిళ నారి తిరగబడితే గాని వీరి బుద్ధి మారదని అందరు ఏకమై కళాశాల యజమానికి అంతేకాకుండా డిచ్ పల్లి లోని పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.డిచ్ పల్లి పోలీస్ ఇన్స్పెక్టర్ గణేష్ వెంటనే స్పందించి ప్రైవేట్ నర్సింగ్ కళాశాలకు పోలీసు వాహనాన్ని తీసుకెళ్లి ర్యాగింగ్ చేస్తున్న సీనియర్ విద్యార్థులకు అదుపులోకి తీసుకున్నారు. ర్యాగింగ్ చేస్తున్న సీనియర్ విద్యార్థులకు పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్తుండగా మహిళా విద్యార్థినులు ఆకసి, ఆగ్రహంతో ముక్కుమ్మడిగా రాళ్ల వర్షం కురిపించారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని రాగింగ్ చేస్తున్న సీనియర్ విద్యార్థులకు పోలీస్ వాహనంలో తీసుకెళ్లి కేసు నమోదు చేస్తున్నామని ఎస్సై గణేష్ తెలిపారు.



# యువ గళం పాదయాత్రను జయప్రదం చేయండి

## కదిరి గుర్తుండిపోయేలా పాదయాత్రను విజయవంతం చేద్దాం

## నియోజవర్గంలో నాలుగు రోజులు నారా లోకేష్ పాదయాత్ర

## కదిరి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, మార్చి 16, మనం న్యూస్: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి భవిష్యత్తు యువ నాయకుడు నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర ఈనెల 18వ తేదీన కదిరి నియోజవర్గంలో ప్రారంభం కానుందని ఈ పాదయాత్రను కానీ విని ఎరగని రీతిలో నారా లోకేష్ బాబుకు కదిరి గుర్తుండిపోయేలా తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కదిరి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని. పాదయాత్రలో వైకాపా చేస్తున్న అరాచకాలను ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు.

**వైకాపా అరాచక పాలనపై ప్రజలను**
**చైతన్యవంతులన్నీ చేయడమే లక్ష్యంగా పాదయాత్ర**

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పాదయాత్ర ఈనెల 18 న కదిరి నియోజకవర్గంలో ప్రారంభం కానుంది. రాష్ట్రంలో అధికార వైసీపీని ఓడించే లక్ష్యంతో నారా లోకేష్ పాదయాత్ర చేపడుతున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలుపుతున్నారు.ఏడాదికి పైగా సాగే యాత్రలో రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు వేల కిలోమీటర్ల పొడవున లోకేష్ పాదయాత్ర సాగనుంది. అందులో భాగంగా శ్రీ అన్నమయ్య జిల్లా మొలకలచెరువులో పాదయాత్ర ముగించి శ్రీ సత్య సాయి జిల్లా తనకల్లు మండల పరిధిలోని చీకటిమనీ పల్లి వద్దనుండి పాదయాత్ర ప్రారంభం కానుంది. రాష్ట్రంలో అరాచక పాలన పై ప్రజలను చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా నారా లోకేష్ యువ గళం పేరుతో యాత్ర చేపట్టడంతో ఆ పార్టీ నాయకులు,కార్యకర్తల్లో జోష్ లో ఉన్నారు. పాదయాత్రకు సంఘీభావం తెలిపేందుకు జిల్లా నలుమూలల నుంచి తెలుగుదేశం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నందున ఆ దిశగా నియోజకవర్గ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు.

**మొదటిరోజు యువ గళం పాదయాత్ర షెడ్యూల్**

ఈనెల 18 శనివారం న కదిరి నియోజవర్గంలో చీకటి మానిపల్లి వద్ద నుండి లోకేష్ పాదయాత్ర చేపడుతున్నట్లు ఆ పార్టీ శ్రేణులు తెలిపారు. 18వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు పాదయాత్ర ప్రారంభమై 8 గంటల 45 నిమిషాలకు గంగసానిపల్లి వద్ద టమోటా రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు.9.30 నిమిషాలకు బిషనవారిపల్లి లో బలిజ సోదరులతో సమావేశం,10.25 నిమిషాలకు కొక్కంటి క్రాస్ వద్ద స్వాగత కార్యక్రమం, గంటపాటు విరామం అనంతరం12.15 నిమిషాలకు కొక్కంటి క్రాస్ కు చేరుకోనున్నారు. అనంతరం 1.15 నిమిషాలకు ఎస్టి కమ్యూనిటీతో సమావేశం. ఆ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలపై చర్చిస్తారని సమాచారం. మూడు గంటలకు తనకల్లు మండల సమీపంలో స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేశారు.4.30 నిమిషాలకు తనకల్లు మండల కేంద్రంలో ఎస్సీలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం నల్లచెరువు మండల పరిధిలోకి యాత్ర కొనసాగుతుందని ఆ పార్టీ శ్రేణులు తెలుపుతున్నారు.

**రెండో రోజు పాదయాత్ర షెడ్యూల్**

నల్లచెరువు మండల పరిధిలోని చిన్న పల్లోలపల్లి వద్ద నుండి రెండో రోజు లోకేష్ పాదయాత్ర ప్రారంభం కానున్నట్లు ఆ పార్టీ శ్రేణులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల 30 నిమిషాలకు సంజీవ్ పల్లి వద్ద భారీగా స్వాగత కార్యక్రమ ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం నల్లచెరువు మండల కేంద్రంలో చేనేత కార్మికులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి వారు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలపై చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అనంతరం పాదయాత్ర కొనసాగిస్తూ ప్రజలతో మమేకమైతు



వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు.

**600 కిలోమీటర్ల మైలురాయి ప్రారంభం**

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర 600 కిలోమీటర్ల మైలురాయి ప్రారంభం నల్లచెరువు మండల పరిధిలోని పాత స్టేషన్ వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు శ్రేణులు తెలుపుతున్నారు. అనంతరం రాట్నాల పల్లెలో కురుబ కులస్తులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. అనంతరం జోగన్నపేట వద్ద భారీ బహిరంగ సభ ఆ సభలో లోకేష్ మాట్లాడునున్నారు. ఆరోజు జోగన్నపేటలో బస చేయనున్నారు.

**మూడవరోజు పాదయాత్ర షెడ్యూల్**

జోగన్నపేట వద్ద నుండి మూడవరోజు పాదయాత్ర ప్రారంభం కానున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు కదిరి రూరల్ మండలం పరిధిలోని మోటుకు పల్లి వద్దకు చేరుకోనుంది. అనంతరం అనాధలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు.10.20 నిమిషాలకు బీసీ కమ్యూనిటీలతో సమావేశం ఏర్పాటు చేసి వైకాపా ప్రభుత్వంలో బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై చర్చిస్తారని ఆ పార్టీ శ్రేణులు తెలుపుతున్నారు. భోజన విరామం తర్వాత పి ఆర్ గ్రాండ్ హోటల్లో ముస్లిం, మైనార్టీ సోదరులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.4. 20 నిమిషాలకు జీవిమాను సర్కిల్ వద్ద స్వాగత కార్యక్రమం 4.45 నిమిషాలకు ఎంజి రోడ్ లో బంగారు వ్యాపారులు, స్వర్ణకారులతో ముఖాముఖి కార్యక్రమం. సాయంత్రం ఐదు గంటలకు శ్రీమత్ ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వామివారి దర్శనం.5.45 నిమిషాలకు కోనేరు సర్కిల్ వద్ద స్థానికులతో మాట్లాడునున్నారు. అక్కడి నుండి పాదయాత్ర కొనసాగిస్తూ ఆర్డిఓ ఆఫీస్ ఎదురుగా బస చేయనున్నట్లు ఆ పార్టీ శ్రేణులు తెలిపారు.

**నాలుగవ రోజు పాదయాత్ర షెడ్యూల్**

నాలుగవ రోజు లోకేష్ యువ గళం పాదయాత్ర ఉదయం 8 గంటలకు ఆర్డిఓ ఆఫీసు నుంచి ప్రారంభమై 8.15 నిమిషాలకు గృహ లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేయనున్నారు.8.45 నిమిషాలకు అల్లీపూర్ తాండ వద్ద స్వాగత కార్యక్రమం. అక్కడినుండి పాదయాత్ర కొనసాగిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.10.40 నిమిషాలకు ముత్యాల చెరువు వద్దకు పాదయాత్ర చేరుకుంటుందని పార్టీ శ్రేణులు తెలిపారు. అనంతరం పుట్టపర్తి నియోజవర్గంలోకి పాదయాత్ర అడుగుపెట్టనుంది దీంతో కదిరి నియోజకవర్గం లో పాదయాత్ర పూర్తి అవుతుందని ఆ పార్టీ శ్రేణులు తెలుపుతున్నారు.

**వైకాపా అరాచకాలను ప్రజలకు వివరిస్తాం**

లోకేష్ యువ గళం పాదయాత్రలో వైకాపా ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలకు పూర్తిస్థాయిలో వివరిస్తామని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తెలుపుతున్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ అన్ని వర్గాలను నిండా ముంచేశారని ఆరోపించారు. ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వచ్చే రోజుల్లో వైకాపాకు గట్టిగా బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

**వైకాపా అరాచక పాలనపై ప్రజలను**
**చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా పాదయాత్ర**

వైకాపా ప్రభుత్వ అరాచక పాలన పై ప్రజలను చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా పాదయాత్ర సాగుతుందని ఆ పార్టీ శ్రేణులు తెలుపుతున్నారు. లోకేష్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిస్థాయిలో తెలుసుకొని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తారని తెలిపారు. ఈ పాదయాత్రను విజయవంతం చేసి రాష్ట్రంలోనే కదిరికి ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా ప్రతి కార్యకర్త ప్రతి తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

---

### హాల్ టికెట్ కలిగిన విద్యార్థులకు

## బస్సు సౌకర్యం కల్పించాలి

**పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి**

**మండల ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి శాంతరాజ్**



కనేకల్ మనం న్యూస్: ఈనెల 15వ వ తేదీ నుంచి రాష్ట్రంలో ప్రారంభం అవుతున్నటువంటి ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు వేలాదిమంది కేంద్రాలకు పరీక్షలు నిమిత్తం హాజరుకానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని పరీక్ష కేంద్రాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ కనేకల్ మండల కార్యదర్శి శాంత రాజ్ డిమాండ్ చేశారు. వేసవి కాలం దృష్ట్యా ప్రతి క్లాస్ రూమ్ లో ఫ్యాన్ సౌకర్యాలు కల్పించి ఇందులో భాగంగా పరీక్ష కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం, టాయిలెట్ శుభ్రంగా నియమనిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు . పరీక్ష కేంద్రాలకు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు రావడం జరుగుతుంది కాబట్టి వెయిటింగ్ హాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. దానితోపాటు పరీక్ష కేంద్రాలకు 30 నిమిషాలు ఆలస్యం అయినా పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని దాన్ని తప్పకుండా పరీక్ష కేంద్రం అధికారులు పాటించాలి దానితోపాటు ఇంటర్ హాల్టికెట్ ఉన్నటువంటి విద్యార్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు విద్యార్థులు పరీక్షలు విజయవంతంగా కొనసాగేందుకు కృషి చేయాలని కోరారు.

## ఘనంగా అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి

**పూలమాలలు వేసి నివాళులర్పించిన సర్పంచ్ లలిత, ఎంపీపీ చంద్రమ్మ**



ఉరవకొండ, మార్చి 16, మనం న్యూస్: ఆంధ్ర రాష్ట్ర సాధనకు ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు 122వ జయంతి వేడుకలు గురువారం ఉరవకొండలో ఘనంగా జరిగాయి.గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్ద సర్పంచ్ మీనుగా లలిత, ఎంపీపీ చందా చంద్రమ్మ,పార్టీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, వార్డు సభ్యుడు నిరంజన్ గౌడ్, కో అప్షన్ సభ్యులు పామిడి సలీమ్,ఈఓ గౌస్ తదితరులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు ప్రాణత్యాగంతోనే ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించుకోగలిగామని,ఆయన త్యాగాన్ని ఎవరు మరువలేనిదని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఓబన్న, నిర్మలమ్మ, మైనారిటీ నాయకులు పామిడి జాకీర్, మద్దికెర అన్వర్, తాజుద్దీన్,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మినీ ట్యాంక్ బండ్‌గా మారనున్న బీబీనగర్ పెద్ద చెరువు

**- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ప్రత్యేక చొరవ..**

బీబీనగర్, మార్చి 16 (మనం న్యూస్): ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ప్రత్యేక చొరవతో మండల కేంద్రంలోని పెద్ద చెరువు నూతన అందాలతో మినీ ట్యాంక్ బండ్ గా నూతన కళను సంతరించు కోబోతుంది. సుందరీకరణలో భాగంగా గురువారం హెచ్ఎండీఏ అధికారులు చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీబీనగర్ చెరువుతో పాటు భువనగిరి, పోచంపల్లి చెరువులను కూడా మార్చనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే చెరువులను పరిశీలించిట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ ప్రభాకర్, ఏఈ వెంకన్న, బీబీనగర్ గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# రెగ్యులర్ వెటర్నరీ ఎక్కడ

విడపనకల్లు మార్చి 16 మనం న్యూస్ : గత కొన్ని ఏళ్లగా పశు వైద్యాధికారి లేక కిందస్థాయి సిబ్బంది ఇన్చార్జిలతోనే కొనసాగుతుంది. రెగ్యులర్ వెటర్నరీ ఎక్కడని పలువురు రైతులు వాపోతున్నారు. రెగ్యులర్ పోస్ట్ అంటూ చూపడం లేదు. స్థానిక ఉన్న వెటర్నరీ పశు వైద్యశాలలో గత కొన్ని ఏళ్లగా అటెండర్, డాక్టరు, కిందిస్థాయి పోస్టులన్నీ ఇన్చార్జిల పాలనలోనే సాగుతున్నాయి. ఒక దగ్గర డ్యూటీ చేస్తే ఇంకొక దగ్గర వేతనాలు తీసుకుంటూ వాళ్ళ ఇష్టం వచ్చినట్టు మందులు అమ్ముకుంటున్నారు. ప్రతి పనికి ఓ రేటు అంటూ హాట్ టాపిక్ గా మారుతున్నారు. అడిగే నాథుడే కరువయ్యాడు. కొన్ని గ్రామాల్లో పశు వైద్యశాలల్లో కనీసం వాకిలి తెరవడం కూడా చూడలేదంటున్నారు రైతులు, ప్రజలు. వేలాల్లో జీతాలు తీసుకుంటూ అధికారులు నిద్రమత్తులో ఉదయం 10 కి రావడం 11 కి వెళుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే మేము బయట ఉన్నాం. మాకు మీరు ఒక్కరేనా ఊర్లో ఎన్నో కేసులు ఉంటాయంటూ రైతులను బెదిరిస్తున్నారు. వివిధ రోగాలతో పశువులు చనిపోతున్నా పట్టించుకునే నాధుడు కరువయ్యారని రైతులు వాపోతున్నారు. గోపాలమిత్ర, సచివాలయం ఆర్ బి కే సెంటర్ సిబ్బంది అక్కడక్కడ చోరువ చూపుతున్నా చాలిచాలని వైద్యం మాదిరిగా మిగిలిపోయింది. పై స్థాయి అధికారులు అంటూ లేక ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుంది ప్రభుత్వం. ఎన్ని మొట్టకాయలు వేసినా మా పని ఇంతే మా తీరు ఇంతే ప్రతి పనికి ఓ రేటు అంటూ



యాదేచ్ఛగా సొమ్ము దోచుకుంటున్నారు. వంద రూపాయలు కూడా అమ్ముకుంటున్నారు. పేరుకు ఇంచార్జ్ పాలన అంతా ఇష్టం వచ్చినట్టు అమ్ముకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రెగ్యులర్ పశు వైద్యాధికారిని నియమించి పశువులను కాపాడాలిసిన అవసరం ఎంతైనా ఉంది.

## 17పోలీస్ స్టేషన్లలో సి.సి. కెమెరాలు

**రాష్ట్ర పోలీసుశాఖ టెక్నికల్ సర్వీస్ డి.ఐ.జి పీహెచ్డీ రామకృష్ణ**



అనంతపురం. మార్చి 16 మనం న్యూస్ ప్రతినిధి. జిల్లాలోని 17 పోలీస్ స్టేషన్లలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర పోలీస్ శాఖ టెక్నికల్ సర్వీస్ డి.ఐ.జీ. పి.హెచ్.డి రామకృష్ణ తెలిపారు.గురువారం అన్ని జిల్లాల పోలీసు అధికారులతో అయన జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.పోలీసు స్టేషన్లలో నూతనంగా సి.సి.కెమేరాలు ఏర్పాటు చేయాల్సిన విషయమై అయన సిబ్బందికి పలు సూచనలు చేశారు.జిల్లాలో నూతనంగా మంజూరైన సి.సి.కెమేరాలను 17 పోలీసు స్టేషన్లలో ఏర్పాటు చేయనున్నట్లు అయన తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, డీసీఆర్బీ విశ్వనాథచౌదరి, కమ్యూనికేషన్ సి.ఐ శ్రీకాంత్, టెక్నికల్ ఎస్సై సుధాకర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

### కిన్నెరసాని జలాల పంపిణీ నూతన పంప్ హౌస్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే వనమా

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 16 (మనం ప్రతినిధి) : కొత్తగూడెం పట్టణానికి కిన్నెరసాని జలాలను పంపిణీ చేసే నూతన పంప్ హౌస్ ను కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్తగూడెం పట్టణానికి కిన్నెరసాని జలాల తరలింపులోని జరుగుతున్న అవరోధాలను అడిగి తెలుసుకొని, వెంటనే సమస్యను పరిష్కరించి, పట్టణ ప్రజలకు కిన్నెరసాని జలాలను ఎటువంటి ఆటంకాలు లేకుండా అందించాలని అధికారులను ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆదేశించారు. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని, రాబోయే కాలంలో, కిన్నెరసాని జలాల పంపిణీలో ఎలాంటి ఆటంకాలు ఎదురు కావని ఎమ్మెల్యే వనమా ప్రజానీకానికి హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే వనమా వెంట మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రఘు, లక్ష్మీదేవి పల్లి ఎంపీపీ బాదావత్ సోనా, కౌన్సిలర్లు కోలాపూరి ధర్మరాజు, సర్పంచ్ ఓమ్ జి, మున్సిపల్ టిపిఒ బడుగు ప్రభాకర్, మున్సిపల్ ఏఈ సాహితి, బిఆర్ఎస్ నాయకులు కొండ స్వామి, పోస్ట్ ఆఫీస్ వాసు, పూర్ణ, రామకోటి, సురేష్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

### వికారాబాద్ పట్టణంలో రోడ్డు , రైల్వే ఓవర్ బ్రిడ్జి విస్తరణ పనులు వెంటనే చేపట్టాలి

**క్షేత్రస్థాయిలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పరిశీలన**

వికారాబాద్, మార్చి 16 ,మనం ప్రతినిధి: వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ చౌరస్తా నుండి ఆర్టీసీ బస్ డిపో వరకు ఉన్న బ్రిడ్జి నిర్మాణంలో వస్తున్న సమస్యలను పరిష్కరిస్తూ రోడ్డు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ చౌరస్తా నుంచి మేరీ ఎనాట్స్ దవఖాన మీదుగా ఆర్టీసీ బస్ డిపో వరకు ఉన్న రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులకు గాను ఇప్పటికే రూ.12 కోట్ల ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ పనుల జాప్యంపై తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి గురువారం స్వయంగా పరిరక్షించారు. వికారాబాద్ జిల్లా ఆర్ అండ్ బి ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో కలియతిరిగారు. పనులు చేపట్టేందుకు వీలుగా బ్రిడ్జికి సమీపంలో ఉన్న క్రిస్టియన్ సంస్థ ప్రతినిధులు అదేవిధంగా అక్కడ నివాసముంటున్న ప్రజలతో సమావేశం నిర్వహించి సమస్య పరి ష్కార దిశగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు, రవాణాకు ఇబ్బందికరంగా ఉన్న బ్రిడ్జి రోడ్డు పనులను చేపట్టేందుకు వీలుగాకృషి చేయవలసిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. కలెక్టర్‌తో పాటువికా రాబాద్ఆర్‌డిఓ విజయ కుమారి, తహసిల్దార్ వాహిదా ఖాతున్, ఆర్ అండ్ బి డీఈ శ్రీధర్ రెడ్డి, రెవెన్యూ ఇంజనీరింగ్ విభాగాల అధికారులు ఉన్నారు.

## చైర్మన్ పదవికి బర్కం లక్ష్మి రాజీనామా

**-అధికార పార్టీ డైరెక్టర్లపై విమర్శలు**

**--అక్రమాలన్నీ బయట పెడతానని స్పష్టీకరణ**

రాజన్న సిరిసిల్ల, మార్చి 16, (మనం న్యూస్): పెద్దూరు సింగిల్ విండోచైర్మన్ పదవికి బర్కం లక్ష్మి గురువారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని తొలి మహిళ సింగిల్ విండో చైర్మన్ గా ఉన్న తనపై అధికార పార్టీ డైరెక్టర్లు ముందు నుంచి అవమానాల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరవై గుంటలభూమికి లక్ష రూపా యలలోను ఇవ్వకపోవడంతో తన పట్ల ఎమోషనల్ బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నారంటూ మండిపడ్డారు. చిత్తశుద్ధితో రైతులకు సేవలందిస్తుంటే అధికార పార్టీ నాయకులు ఓర్వలేకపోతున్నారని అన్నారు. రాజీనామా చేసిన రైతుల పక్షాన నిలబడతానని అధికార పార్టీ డైరెక్టర్ల అక్రమాలన్నీ బయటపెడతానని అన్నారు. మహిళల పట్ల అధికార పార్టీకి కనీసం గౌరవం లేకుండా పోయిందని, మంత్రి కేటీఆర్ అండ చూసుకొని నాయకులు ఇష్టారాజ్యంగ వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో బిజెపి పట్టణ అధ్యక్షులు నాగుల శ్రీనివాస్, యువ మోర్చా నాయకులు బూర్ల విష్ణు ప్రసాద్,పలువురు మహిళా మోర్చా నాయకులు పాల్గొన్నారు.

## ప్రతిభకు ప్రత్యేక అభినందనలు




తొట్టంబేడు, మార్చి 16, మనం న్యూస్: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ఛైర్మన్ యల్లంపాటి కోటేశ్వరబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి ప్రతిభకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. భారత రాజధాని ఢిల్లీలోని ఇండియా ఇంటర్నే



షనల్ సెంటరులో బుధవారం జరిగిన ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవ వేడుకల్లో యల్లంపాటి కోటేశ్వరబాబు, కలవగుంట భరత్ రెడ్డిని ప్రత్యేకంగా సన్మానం చేశారు. వీరిద్దరూ ఎన్ సీఆర్ సీలో బాధ్యతలు తీసుకున్న అనతి కాలంలోనే వినియోగదారులు తరపున 43 కేసులు నమోదు చేయించడంతో పాటు... వీరు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవ వేడుకల్లో అతిరథ మహారథుల మధ్య సన్మానం చేశారు. కోటేశ్వరబాబు, భరత్ రెడ్డి ప్రతిభను... అంకితభావాన్ని గుర్తించి సన్మానం చేసి జ్ఞాపిక అందచేస్తున్నట్లు నిర్వాహకులు సభాముఖంగా తెలియచేశారు. వీరిద్దరూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని వారందరూ ఆకాంక్షించారు. శ్రీకాళహస్తి ఖ్యాతిని దేశ స్థాయిలో చాటి చెప్పిన కోటేశ్వరబాబు, కలవగుంట భరత్ రెడ్డి ప్రతిభను, కృషిని, అంకిత భావాన్ని అభినందిద్దాం.

### బహిర్గత మలవిసర్జన రహిత పంచాయతీగా తీర్చిదిద్దాలి



అగలి మార్చి 16 మనం న్యూస్ : మండల పరిధిలోని ఇరిగేపల్లి గ్రామ పంచాయతీ ను బహిర్గత మల విసర్జన రహిత(ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ ప్లస్) గ్రామ పంచాయతీ గా, పరిశుభ్ర గ్రామ పంచాయతీ గా తీర్చిదిద్దుటకు, అన్ని రకాల ఘన, ద్రవ వ్యర్థ రహిత గ్రామము గా ఏర్పాటు చేయుటకు, ప్రజలు పాటించవలసిన పద్ధతులపై న మరియు ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చుదిద్దుటకు, తమ వంతు ప్రజా ఆర్థిక విరాళాల సహకారంతో మరి య ప్రజా భాగస్వామ్యం తో స్వచ్ఛ గ్రామం గా మరియు 100% మరుగు దొడ్డి వినియోగించడం ద్వారా ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ ప్లస్ గ్రామంగా ఏర్పాటు చేయడం పై గ్రామ పంచాయతీ పరిధిలోని పాఠశాల లను సందర్శించి మరుగుదొడ్ల వినియోగం మరియు స్వచ్ఛత పై స్వచ్ఛ భారత్ మిషన్ కో ఆర్డినేటర్ సునీత, అనంత్ అవగాహన కార్యక్రమం ను గ్రామ పంచాయతీ లోని వాలంటీర్ల కు, మరియు స్వచ్ఛత పారిశుధ్య సిబ్బందికి ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి శ్రీమతి పద్మ గారు, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, సచివాలయం సిబ్బంది గణేష్, రంగ రాజు, ఇరిగేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వాలంటీర్లు పాల్గొనడం జరిగింది.

# స్టెప్పులేసిన టీమిండియా మాజీలు

.న్యూఢిల్లీ: లెజెండ్ లీగ్ క్రికెట్2023లో భాగంగా వరల్డ్ జెయింట్స్ తో నిన్న జరిగిన మ్యాచ్‌లో ఇండియా మహారాజాన్ ఆటగాళ్లు హర్భజన్ సింగ్, సురేశ్ రైనా నాటు నాటు సాంగ్‌కు చిందేసి అభిమానులను ఆకట్టుకుంటున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. సీఎస్కే మాజీ క్రికెటర్లను అభిమానులు రామ్ చరణ్, తారక్ లతో పోలుస్తూ కామెంట్ల వర్షం కురిస్తున్నారు. మ్యాచ్ విషయానికొస్తే.. ఇండియా మహారాజాస్ తో జరిగిన మ్యాచ్ లో వరల్ జెయింట్స్ 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన మహారాజన్.. సురేశ్ రైనా( 41 బంతుల్లో 49, 2 ఫోర్లు, 3 సిక్సులు), బిస్లా(36), ఇర్ఫాన్ పఠాన్(25) ఓ మోస్తరుగా రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 136 పరుగులు



చేసింది. వరల్ జెయింట్స్ బౌలర్లు బ్రెట్ లీ( 3-0-18-3), పోపు(4-0-22-2), టీనో బెస్ట్(4-0-27-2) చెలరేగారు. అనంతరం బరిలోకి దిగిన వరల్ జెయింట్స్.. క్రిస్ గేల్ (46 బంతుల్లో 57, 9 ఫోర్లు, సిక్స్) వీరవిహారం ధాటికి 18.4 ఓవర్లో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. గేల్ కు షేన్ వాట్సన్(26), సమిత్ పటేల్(12) సహకరించారు. మహారాజాన్ బౌలర్లలో యూసఫ్ పఠాన్(4-0-14-2), ప్రవీణ్ తాంబే(4-0-22-1), హర్భజన్(4-0-29-1) పొదుపుగా బౌలింగ్ చేయడంతో వికెట్లు పడగొట్టి తమ జటటును గెలిపించేందుకు విఫలయత్నం చేశారు. ఈ మ్యాచ్ లో ఇండియా మహారాజాన్ జట్టుకు హర్భజన్ సింగ్ నాయకత్వం వహించాడు. గంభీర్ గైర్హాజరీతో భజ్జీ ఈ బాధ్యతలు చేపట్టాడు. లీగ్ లో మహారాజాన్ ఇప్పటిదాకా ఆడిన 4 మ్యాచ్ ల్లో మూడింటిలో ఓడిపోయి ఒక మ్యాచ్ లో గెలవగా.. వరల్ జెయింట్స్ 3 మ్యాచ్ ల్లో 2 విజయాలు, ఓ పరాజయం.. ఆసియా లయన్స్ 3 మ్యాచ్ ల్లో 2 విజయాలు, ఓ ఓటమిని ఎదుర్కొన్నాయి. టోర్నీలో ఆఖరి లీగ్ మ్యాచ్ ఇవాళ(మార్చ్16) వరల్ జెయింట్స్, ఆసియా లయన్స్ తలపడనున్నాయి.

## ఐపీఎల్ 2024లోనూ ఎంఎస్ ధోనీ ఆడతాడా..?



న్యూఢిల్లీ: మార్చి 31 నుంచి ఇండియన్ ప్రీమియర్ లీగ్ పదహారో సీజన్ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య పోరుతో మెగా టోర్నీ షురూ అవుతుంది. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఎంఎస్ ధోనీ ప్రాక్టీస్‌ను కూడా ప్రారంభించేశాడు. అయితే, ఈ సీజన్ తర్వాత ధోనీ ఐపీఎల్‌కూ గుడ్‌బై చెప్పేస్తాడని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేశారు. ఇదే విషయాన్ని సురేశ్ రైనా దృష్టికి తీసుకెళ్లగా..అద్భుతమైన సమాధానం ఇచ్చాడు. ప్రస్తుతం రైనా లెజెండ్స్ లీగ్ క్రికెట్ ఆడుతున్నాడు. ప్రెస్ కాన్ఫరెన్స్‌లో రైనా మాట్లాడుతూ.. తప్పకుండా వచ్చే సీజన్‌లోనూ ఆడతాడని పేర్కొన్నాడు.''ఎంఎస్ ధోనీ ఐపీఎల్ 2024 సీజన్‌లోనూ ఆడాలని కోరుకుంటున్నా. అయితే, అతడి ఉద్దేశం ఏంటో మనకు తెలియదు. బ్యాటింగ్ బాగానే చేస్తాడు. ఫిట్నెస్లో తిరుగులేదు. అయితే, ఈ ఏడాది ధోనీ ప్రదర్శనపైనే వచ్చే సీజన్ ఆడాలా...? వద్దా..? అనే నిర్ణయం ఆధారపడి ఉంటుంది. సంవత్సరం నుంచి ఆడని ధోనీ, అంబటి రాయుడుకు సవాల్ తప్పదు. జట్టు ఇప్పటికీ చాలా బలంగా ఉంది. చాలామంది యువ ఆటగాళ్లు నిరూపించుకుంటున్నారు. రుతురాజ్ గైక్వాడ్, డేవన్ కాన్వే, జడేజా, బెన్ స్టోక్స్, దీపక్ చాహర్.. ఇలా అనుభజ్ఞులు, యువతతో కూడిన జట్టు సిద్ధంగా ఉంది. అయితే, వారు ఎలా ఆడతారో చూడాలి'' అని రైనా చెప్పాడు.ఇప్పటికీధోనీ ఫోన్‌లోనూ అందుబాటులో ఉండడని చాలా మంది క్రికెటర్లు చెబుతూ ఉంటారు. అయితే, తాను మాత్రం ధోనీతో టచ్లోనే ఉన్నట్లు రైనా తెలి పాడు. ''అలాంటిదేం లేదు. తరచూ టచ్లోనే ఉంటాం. ఇప్పుడు ధోనీ కఠినంగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. సీఎస్కే సోషల్ మీడియాలోని వీడియోలను చూస్తే మీకే తెలుస్తుంది. నెట్స్‌లో భారీ షాట్లను కొట్టేస్తున్నాడు. మ్యాచ్లోనూ ఆడితే విజయం వరించడం ఖాయం'' అని రైనా తెలిపాడు.

# విరాట్ దూకుడును ఆసీస్ అడ్డుకోగలదా..?

న్యూఢిల్లీ: జట్టులో స్థానం కోసం పోటీ లేదు.. శతకం చేయాలనే ఒత్తిడి లేదు.. కెప్టెన్సీ భారం అసలే లేదు. తానేంటో నిరూపించుకోవాల్సిన అవసరం లేదు.. ఇదీ ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ముందు టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పరిస్థితి. శుక్రవారం నుంచి ఆసీస్‌తో మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ క్రమంలో మరోసారి విరాట్ విజృంభించాలని అభిమానులు కోరుతున్నారు. మరి విరాట్‌ను ఆసీస్ అడ్డుకోగలదో లేదో చూడాలి. ఈలోగా ఆసీస్‌పై విరాటుడి దండయాత్ర ఎలా ఉందో ఓసారి పరిశీలిద్దాం.. దాదాపు మూడేళ్లపాటు సెంచరీ లేదనే విమర్శలు ఎదుర్కొన్నాడు.




ఓర్పుగా సహనంతో ఉన్న విరాట్ ఆరు నెలల కిందట టీ20ల్లో సెంచరీ.. మూడు నెలల ముందు వన్డేల్లో శతకం.. ఇప్పుడు టెస్టుల్లోనూ సెంచరీ కొట్టి సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాడు. తనపై ఉన్న కొండంత భారాన్ని వదిలించుకున్నాడు. ఇక రాబోయే కాలంలో సరికొత్త విరాట్ను చూడటం తథ్యం.. అందుకు ఆసీస్తో వన్డే సిరీస్ తొలి వేదికగా నిలవనుంది. ఎందుకంటే ఆస్ట్రేలియా జట్టుపై విరాట్ రికార్డు అలాంటిది మరి. విరాట్ ఆసీస్‌పై 43 వన్డేల్లో 54.81 స్ట్రైక్రేట్తో 2,083 పరుగులు సాధించాడు. ఇందులో 8 శతకాలు ఉండటం విశేషం. సచిన్ తెండూల్కర్ కంటే కేవలం ఒక్క సెంచరీ మాత్రమే తక్కువ. విరాట్ ఫామ్‌ను బట్టి ఇప్పుడీ సిరీస్లోనే సచిన్ను అధిగమించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. గత పది వన్డే ఇన్నింగ్సలలో మూడు సెంచరీలు ఉన్నాయి.

**సచిన్ రికార్డుకు చేరువగా..**

క్రికెట్ దిగ్గజం సచిన్ తెండూల్కర్ రికార్డులను దాటాలంటే ప్రస్తుతం ఉన్న క్రికెటర్లలో విరాట్ కోహ్లీకి మాత్రమే సాధ్యమవుతుంది. అన్ని ఫార్మాట్లలో కలిపి 'వంద' శతకాలను సచిన్ సాధించగా.. విరాట్ కోహ్లీ 75 వద్ద ఉన్నాడు. కానీ, ఓ రికార్డుకు మాత్రం అత్యంత చేరువగా ఉన్నాడు. అదే వన్డేల్లో సెంచరీల రికార్డు. అవునండి.. సచిన్ 49 శతకాలు చేయగా.. విరాట్ 46 సెంచరీలతో వెనుకనే ఉన్నాడు. మరో నాలుగు చేస్తే సచిన్ను అధిగమిస్తాడు. ఇప్పుడున్న ఫామ్ను బట్టి ఆసీస్తో జరిగే మూడు వన్డేల్లో సెంచరీలు సాధించినా సాధించగల సత్తా విరాట్ సొంతం. అప్పుడు సచిన్‌తో సమంగా నిలుస్తాడు. ఎలాగూ ఈ ఏడాది ఆసియా కప్, వన్డే ప్రపంచకప్ ఉన్నాయి. కాబట్టి, ఆ రికార్డు మాత్రం విరాట్ కొట్టేయడం ఖాయం.

# సహనం కోల్పోయిన రోనాల్డ్..

పోర్చుగల్: పార్చుగల్ ఫుట్ బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డ్ మరోసారి తన సహనం కోల్పోయాడు. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఆయన గోల్ కొట్టడంలో విఫలమైనాడు. దీంతో మరింత కోపం రావడంతో ఎవరి మీద తన కోపం చూపించాలో తెలియక ఫుట్ బాల్ మీదే చూపించాడు. అది చూసిన మ్యాచ్ రిఫరీ రొనాల్ కు ఎల్లో కార్డు ఇచ్చాడు. సౌదీ అరేబియన్ ప్రో-లీగ్ లో భాంగా అల్-నసర్, అభాల మధ్య మ్యాచ్ జరిగింది. మ్యాచ్ లో 3-1 తేడాతో రొనాల్ సేన విజయాన్ని అందుకుంది. అయితే మ్యాచ్ లో రొనాల్డ్ ఒక్క గోల్ కూడా కొట్టలేకపోయాడు.రొనాల్డ్ చేతిలో బంతి ఉండగా ఫస్ట్ హాఫ్ ముగిసినట్లు విజిల్ వేశాడు రిఫరీ. అప్పటికే గోల్ కొట్టలేదన్న కోపంలో ఉన్న రొనాల్ తన వద్ద బంతిని కాలితో బలంగా తన్నాడు. అంతే ఒక్క ఉదుటన బంతి 60 మీటర్ల దూరంలో పడింది. రొనాల్ చర్యకు తోటి ఆటగాళ్లు సహా ప్రత్యర్థి ఆటగాళ్లు కూడా ఆశ్చర్యపోయారు. ఇది గమనించిన రిఫరీ రొనాల్ కు ఎల్లోకార్డును జారీ చేసాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అయితే రొనాల్ ఇలా చేయడం ఇది తొలిసారి మాత్రం కాదు..



ఇంతకు ముందు అల్ ఇత్తిహాద్ లో జరిగిన మ్యాచ్ లో 1-0తో ఓడిపోయామన్న కోపంతో మ్యాచ్ ముగిసిన తర్వాత క్రిస్టియానో రొనాల్ వాటర్ బాటిల్ ను తన్నడం.. అది ఒక అభిమానికి తగలడం.. ఆ తర్వాత వచ్చి క్షమాపణలు చెప్పడం కూడా జరిగింది. ఇక మార్చ్ 18 (శనివారంఅల్‌నసర్..అభాతో మరో మ్యాచ్ జరుగనుంది.

## ఆసియా కప్‌ని కుదిరితే పాక్‌లో... లేకపోతే శ్రీలంకలో నిర్వహించాలి

### పాక్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్



న్యూఢిల్లీ: ఆసియా కప్ నిర్వహణపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహిసున్నప్పటికీ.. తుది నిర్ణయం మాత్రం ఇంకా వెలువడలేదు. పాక్లో ఆడేది లేదని బీసీసీఐ ఇప్పటికే కరాఖండిగా చెప్పేసింది. అలాగని భారత్ లేకుండా ఆసియా కప్‌ను నిర్వహిస్తే పాకిస్థాన్‌కు ఆదాయపరంగా ఇబ్బంది తప్పదు. ఆసియా కప్ టోర్నీనే కాకుండా ఛాంపియన్స్ ట్రోఫీ 2025 నిర్వహణ కూడా పాకిస్థాన్‌దే కావడం గమనార్హం. భారత్ - పాక్ జట్ల మధ్య మ్యాచ్ లేకుండా ఈ టోర్నీలను నిర్వహిస్తే ప్రేక్షకాదరణ పడిపోవడం ఖాయం. అందుకే దాయాదులపోరాటం ఉండాల్సిందేనని, వేదికనైనా మార్చాలని పాక్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ వ్యాఖ్యానించాడు. ''ఆసియా కప్ 2023 టోర్నమెంట్ పాక్‌లో జరగాలని నేను కోరుకుంటా. కానీ, అలా కుదరకపోతే కనీసం శ్రీలంకలోనైనా టోర్నీని నిర్వహించాలి. ఆసియా కప్ ఫైనల్లో భారత్ - పాకిస్థాన్ జట్లను చూడాలి. ప్రపంచ క్రికెట్లో దాయాదుల జట్ల మధ్య జరిగే ఫైనల్‌కు మించిన మ్యాచ్ ఇంకేం ఉండదు'' అని అక్తర్ తెలిపాడు. మార్చినెలలోనే జరిగే ఆసియా క్రికెట్ కౌన్సిల్ రెండో దఫా సమావేశాల్లో వేదికలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. తొలుత భారత్ ఆడే మ్యాచ్లను యూఏఈలో నిర్వహిస్తారనే వార్తలు వచ్చాయి. కానీ, వాటిని ఏసీసీ ధ్రువీకరించలేదు. పాక్ మాజీ ఆటగాళ్లు మాత్రం తమ దేశంలోనే టోర్నీ జరగాలని, భారత్ పాల్గొనాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే భారత్ వేదికగా జరిగే వన్డే ప్రపంచకప్ కోసం పాక్ వెళ్లకూడదని సూచనలు చేశారు. వారికి భిన్నంగా షోయబ్ అక్తర్ స్పందించడం విశేషం.

## తొలి వన్డేకు రోహిత్ దూరం!



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ గెలిచి మంచి ఊపుమీద ఉన్న టీమిండియా.. ఇప్పుడు అదే జట్టుతో వన్డే సిరీస్‌లో అమీతుమీ తెల్చుకోవడానికి ఉవ్విళ్లూరుతోంది. టెస్టు సిరీస్ ఫలితాన్నే పునరావృతం చేసి వన్డే సిరీస్‌ను కూడా సొంతం చేసుకో వాలని భారత్ భావిస్తుంటే.. టెస్టు సిరీస్ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని ఆసీస్ వ్యూహాలు రచిస్తోంది. ముంబై వేదికగా శుక్రవారం (మార్చి17) జరగనున్న తొలి వన్డేతో ఈ సిరీస్ ప్రారంభం కానుంది. అయితే తొలి వన్డేకు టీమిండియా రెగ్యూలర్ కెప్టెన్ రోహిత్ శర్మ వ్యక్తిగత కారణాలతో దూరమయ్యాడు. దీంతో అతడి స్థానంలో హార్దిక్ పాండ్యా జట్టు కెప్టెన్సీ బాధ్యతలు నిర్వహించనున్నాడు. తొలి వన్డేకు రోహిత్ దూరం కావడంతో భారత ఇన్నింగ్స్‌ను శుబ్మన్ గిల్‌తో కలిసి ఇషాన్ కిషన్ ప్రారంభించడం దాదాపు ఖాయంగా కన్పిస్తోంది.మరోవైపు స్టార్ ఆల్రౌండర్ రవీంద్ర జడేజా ఈ మ్యాచ్తో వన్డేల్లో పునరాగమనం చేయనున్నాడు. గాయం నుంచి కోలుకున్నాక తొలి వన్డే జడేజా ఆడనున్నాడు. ఇక జడ్డూ జట్టు సెలక్షన్కు అందుబాటులోకి రావడంతో మరో ఆల్రౌండర్ వాషింగ్టన్ సుందర్ బెంచ్కే పరిమితమయ్యే ఛాన్స్ ఉంది. అదే విధంగా స్పిన్నర్లు యజువేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్ ఇద్దరిలో ఎవరో ఒక్కరికే చోటు దక్కే అవకాశం ఉంది. చాహల్‌ను కాదని కుల్దీప్ వైపే జట్టు మెనెజెమెంట్ మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఇక ఆస్ట్రేలియా విషయానికి వస్తే.. గాయం కారణంగా ఆఖరి రెండు టెస్టులకు దూరమైన స్టార్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ తిరిగి జట్టుతో చేరాడు. అదే విధంగా ఈ సిరీస్కు ఆసీస్ రెగ్యూలర్ కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ దూరం కావడంతో స్టీవ్ స్మిత్ సారథ్యం వహించనున్నాడు.

**తుది జట్లు(అంచనా)**

భారత్: శుబ్మన్ గిల్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా (కెప్టెన్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్, ఉమ్రాన్ మాలిక్

ఆస్ట్రేలియా: డేవిడ్ వార్నర్, ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్ (కెప్టెన్), మార్నస్ లాబుషేన్, మార్కస్ స్టొయినిస్, అలెక్స్ కారీ (వికెట్ కీపర్), గ్లెన్ మాక్స్వెల్, సీన్ అబాట్, నాథన్ ఎల్లిస్, మిచెల్ స్టార్క్, ఆడమ్ జంపా

## ఒక్కరోజే 18 సినిమాలు/సిరీస్‌లు




ఇటీవల కాలంలో సినిమా థియేటర్లలో పెద్ద సినిమాలేమీ విడుదల కాలేదు. దీంతో సినీ ప్రియులు ఓటీటీ వేదికగా కొత్త సినిమాలు, సిరీస్‌లు చూసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. సినీ ప్రేమికుల ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని ఆయా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు వారం వారం కొత్త కంటెంట్‌తో ముందుకు వస్తున్నాయి. అలా, ఈవారం అందులోనూ కేవలం రేపు ఒక్కరోజే దాదాపు 18 సినిమాలు/సిరీస్‌లు ఓటీటీలో సందడి చేయనున్నాయి.

**పాఠాలు చెప్పే 'సార్'..!**

ధనుష్ హీరోగా టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కించిన చిత్రం 'సార్'. సంయుక్త కథానాయిక. ఇప్పటికే థియేటర్‌లో విడుదలై మంచి స్పందన అందుకున్న ఈ సినిమా శుక్రవారం నెట్‌ఫ్లిక్స్ వేదికగా అందుబాటులో ఉండనుంది. విద్యను అడ్డుపెట్టుకుని కొంతమంది ప్రైవేటు వ్యక్తులు కోట్లు ఎలా సంపాదించుకుంటున్నారో తెలియజేస్తూ.. ప్రభుత్వ పాఠశాలల గొప్పతనాన్ని చూపిస్తూ 'సార్' చిత్రం తెరకెక్కింది. ప్రైవేటు కళాశాలలకు ఛాలెంజ్ విసురుతూ ఓ లెక్చరర్.. ప్రభుత్వ కళాశాల అభ్యున్నతికి ఎలా పాటుపడ్డాడు? అతడికి ఎదురైన సవాళ్లు ఏమిటి? వంటి ఆసక్తికర అంశాలతో ఇది తెరకెక్కింది.

**రచయిత కూడా వచ్చేస్తున్నాడు..!**

'కలర్‌ఫొటో' ఫేమ్ సుహాస్ కథానాయకుడిగా నటించిన రీసెంట్ చిత్రం 'రైటర్ పద్మభూషణ్'. షణ్ముఖ్ ప్రశాంత్ దర్శకుడు. గత నెలలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా సినీ ప్రియుల హృదయాలను హత్తుకుంది. ఈ నేపథ్యంలో రేపు ఈ సినిమా జీ5 వేదికగా విడుదల కానుంది. ఓ యువ రచయితకు ఎదురైన సవాళ్లు.. వాటిని అతడు ఎలా ఎదుర్కొన్నాడనే నేపథ్యంలో ఈ సినిమా రూపుదిద్దుకుంది.

నేడు విడుదల కానున్న మరిన్ని సినిమాలు/సిరీస్‌లు..!

ఆహా

సత్తిగాడి రెండు ఎకరాలు – తెలుగు సినిమా

లాక్డ్ – తమిళ్ సిరీస్ (ఆహా తమిళ్)

నెట్‌ఫ్లిక్స్

సార్/వాతి – సినిమా

కాట్ అవుట్: క్రైమ్, కరప్షన్, క్రికెట్ – ఇంగ్లీష్/హిందీ (డాక్యుమెంటరీ)

కుత్తే – హిందీ సినిమా

ది మెజీషియన్స్ ఎలిఫెంట్ – ఇంగ్లీష్ సినిమా

నాయిస్ – మెక్సికన్ సినిమా

ఇన్ హిస్ షాడో – ఫ్రెంచ్ సినిమా

ఏజెంట్ ఎల్విస్ – ఇంగ్లీష్ సిరీస్ సీజన్ -1

స్కై హై : ది సిరీస్ – స్పానిష్ సిరీస్ సీజన్ -1

మ్యాస్ట్రో ఇన్ బ్లూ – గ్రీక్ సిరీస్ సీజన్ -1

డ్యాన్స్ 100 – ఇంగ్లీష్ రియాల్టీ సిరీస్

జీ 5

యామ్ ఐ నెక్స్ట్ – హిందీ సినిమా

ప్రైమ్ వీడియో

గంధదగుడి – కన్నడ సినిమా

డామ్ – ఇంగ్లీష్ సిరీస్ సీజన్-2

బ్లాక్ ఆడమ్ – ఇంగ్లీష్ సినిమా (స్ట్రీమింగ్ అవుతోంది)

సోనీలివ్

రాకెట్ బాయ్స్ – హిందీ సిరీస్ సీజన్ -2 (స్ట్రీమింగ్ అవుతోంది)

ది వేల్ – ఇంగ్లీష్ సినిమా (స్ట్రీమింగ్ అవుతోంది)

సన్ నెక్ట్స్

వన్స్ అపాన్ ఎ టైమ్ జమాలిగూడ – కన్నడ సినిమా


హాట్‌స్టార్

పాప్ కాన్ – హిందీ సిరీస్ సీజన్ -1

మనం సినిమా

manamcinema

## కొరియోగ్రాఫర్‌కు చేదు అనుభవం..



ప్రముఖ రియాల్టీ షో 'డ్యాన్స్ ఇండియా డ్యాన్స్' ఫేమ్, డ్యాన్స్ కొరియోగ్రాఫర్ సల్మాన్ యూసఫ్ ఖాన్‌కు చేదు అనుభవం ఎదురైంది. బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రమంలో ఇమ్మిగ్రేషన్ అధికారి తనని వేధింపులకు గురి చేశాడంటూ సల్మాన్ ఆరోపణలు చేశాడు. కన్నడలో మాట్లాడలేదనే కారణంతో తనపై ఆగ్రహం వ్యక్తం చేశాడని.. ఇలాంటి ఘటనను తానస్సలు ఊహించలేదని అతడు పేర్కొన్నాడు. ఈ మేరకు తనకు ఎదురైన చేదు అనుభవాన్ని వివరిస్తూ ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టాడు.''దుబాయ్‌కు వెళ్తోన్న సమయంలో కెంపెగౌడ ఎయిర్‌పోర్ట్‌లో ఓ ఇమ్మిగ్రేషన్ అధికారిని కలిశాను. ఆయన కన్నడలో మాట్లాడుతున్నారు. వచ్చీరాని కన్నడలో నేను ఆయనకు సమాధానం చెబుతున్నాను. దాంతో ఆగ్రహానికి గురైన ఆయన నా పాస్‌పోర్ట్‌లో ఉన్న వివరాలను చూపిస్తూ.. ''నువ్వు, మీ తండ్రి పుట్టింది బెంగళూరులోనే అయినా నీకు కన్నడ రాదా?'' అని ప్రశ్నించాడు. నేను బెంగళూరులోనే పుట్టినప్పటికీ పెరిగింది సౌదీలో అని బదులిచ్చాను. దానికి ఆ అధికారి.. ''నువ్వు ఇప్పుడు కనుక కన్నడలో మాట్లాడకపోతే నిన్ను అనుమానితుడిగా భావిస్తా'' అని చెప్పారు. మీరు ఏ కారణాల వల్ల నన్ను అనుమానితుడని భావిస్తారు? అని గట్టిగా ప్రశ్నించగా.. నా ఇష్టం అని బదులిచ్చి ఆయన సైలెంట్ అయిపోయారు. ఈ విషయాన్ని ఎయిర్‌పోర్ట్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడానికి ప్రయత్నించాను. కానీ, ఎవరూ సాయం చేయలేదు. అందుకే ఈ పోస్ట్ పెడుతున్నా'' అని అతడు పేర్కొన్నాడు.

## హీరోగా కొడుకు లుక్ షేర్ చేసిన యాంకర్ సుమ

స్టార్ యాంకర్ సుమ, నటుడు రాజీవ్ కనకాల తనయుడు రోషన్ ఇప్పటికే సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. హీరో శ్రీకాంత్ తనయుడు రోషన్‌తో కలిసి 'నిర్మల కాన్వెంట్' అనే చిత్రంలో నటించాడు. ఆ తర్వాత చదువులపై ఫోకస పెట్టాడు. పై చదువుల కోసం యూఎస్ వెళ్లిన రోషన్ ఇటీవల ఇండియాకు తిరిగి వచ్చాడు. త్వరలో రోషన్ హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్న విషయం తెలిసిందే. అయితే అది ఏ మూవీ, ఏ ప్రొడక్షన్ అనేది సస్పెన్స్‌లో ఉంది. ఈ క్రమంలో మార్చి 15న రోషన్ బర్త్‌డే సందర్భంగా ఈ సినిమాపై ప్రకటన ఇచ్చారు మేకర్స్.అంతేకాదు హీరోగా డెబ్యూ ఇస్తున్న రోషన్ ఫస్ట్‌లుక్ పోస్టర్ను ఈ సందర్భంగా రిలీజ్ చేశారు. క్షణం, కృష్ణ అండ్ హిస్ లీల వంటి విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించి విమర్శకుల ప్రశంసలు అందుకున్న రవికాంత్ పేరేపు.. రోషన్ను హీరోగా పరిచయం చేస్తున్నాడు. మహేశ్వరి మూవీస్ బ్యానర్లో ప్రొడక్షన్ నెం.1గా ఈ చిత్రం రూపొందుతోంది. పి విమల ఈ



సినిమాను నిర్మిస్తున్నారు. ఈ పోస్టర్లో రోషన్ డిజేగా కనిపించాడు. తనయుడు లుక్ను షేర్ చేస్తూ సుమ మురిసిపోయింది. 'ఎట్టకేలకు నీ కల నిజమైంది రోషన్' అంటూ సుమ తన పోస్ట్కు క్యాప్షన్ ఇచ్చింది. కాగా త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు, నటీనటుల గురించి అధికారిక ప్రకటన వెలువడనుంది.

## సర్.. మీ పోస్ట్ చూసి మా అన్నయ్య కన్నీళ్లు పెట్టుకున్నారు: రాజమౌళి


అమెరికా దిగ్గజ సంగీతకారుడు రిచర్డ్ కార్పెంటర్ ఇచ్చిన సర్‌ప్రైజ్ చూసి తన సోదరుడు కీరవాణి ఆనందంతో కన్నీళ్లు పెట్టుకున్నారని దర్శకధీరుడు రాజమౌళి తెలిపారు. ఆస్కార్ క్యాంపెయిన్ మొత్తం ప్రశాంతంగా ఉన్న కీరవాణి రిచర్డ్ సందేశం చూసిన వెంటనే ఉద్వేగానికి లోనైనట్లు జక్కన్న చెప్పారు. ''సర్.. ఆస్కార్ ప్రచారంలో మొత్తం అన్నయ్య ఎలాంటి భావోద్వేగాన్ని ప్రదర్శించలేదు. ఆస్కార్ గెలుపొందడానికి ముందు, ఆ తర్వాత కూడా ఆయన ఏ విధమైన ఉద్వేగాన్నీ బయటపెట్టలేదు. కానీ, మీ పోస్ట్ చూశాక ఆనందంతో కన్నీళ్లు పెట్టుకున్నారు. మా కుటుంబానికి ఇదొక మధురానుభూతి'' అని రాజమౌళి పేర్కొన్నారు. ఉత్తమ ఒరిజినల్ సాంగ్ కేటగిరిలో 'నాటు నాటు...' పాటకుగాను ఆస్కార్ గెలుపొందిన అనంతరం కీరవాణి మాట్లాడుతూ నేను రిచర్డ్ కార్పెంటర్ సాంగ్స్ వింటూ పెరిగాను అని చెప్పిన విషయం తెలిసిందే. ఆ తర్వాత రిచర్డ్ ఫేమస్ సాంగ్ 'టాప్ ఆఫ్ ది వరల్డ్...'ను తనదైన శైలిలో



మార్చి స్టేజ్‌పై కీరవాణి పాడి వినిపించారు. దీనిపై ఆనందం వ్యక్తం చేసిన రిచర్డ్.. కీరవాణి, చంద్రబోస్కు అభినందనలు తెలుపుతూ ఇన్‌స్టాగ్రామ్లో ఓ పోస్ట్ పెట్టారు. తన కుమార్తెలతో కలసి ఆయన 'టాప్ ఆఫ్ ది వరల్డ్...' పాటను ఆలపిస్తూ 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు కంగ్రాట్స్ చెప్పారు. ఆ పోస్టుపై కీరవాణి ఆనందం వ్యక్తం చేశారు. కార్పెంటర్ పోస్ట్ చూసి తనకు కన్నీళ్లు వచ్చేశాయని చెప్పారు.

## ఆ పనిచేస్తూ అడ్డంగా దొరికిన 'లైగర్' బ్యూటీ..

అనన్య పాండే.. లైగర్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన బ్యూటీ. విజయ్ దేవరకొండ సరసన నటించింది కానీ మెప్పించలేకపోయింది. అమ్మడి నటన చూసి కుర్రకారు బెంబేలెత్తిపోయారు. ఓవర్ యాక్షన్‌కు బ్రాండ్ అంబాసిడర్ లా ఉందే అంటూ చెప్పుకొచ్చారు. ఇక అనన్య.. టాలీవుడ్‌లో హిట్ కొట్టి సెటిల్ అవుదాం అనుకున్నా అదిమాత్రం కుదరని పని అని పాపం వెనక్కి వెళ్ళిపోయింది. ఇక ఈ విషయాలను పక్కన పెడితే.. సోషల్ మీడియాలో అమ్మడికి ఉన్న ఫ్యాన్స్ ఫాలోయింగ్ గురించి చెప్పనవసరం లేదు. బికినీ దగ్గరనుంచి అన్ని డిజైనర్ డ్రెస్సుల్లో అందాలను ఆరబోస్తూ కుర్రాళ్లను రెచ్చగొడుతూ ఉంటుంది. తాజాగా ఈ చిన్నది తన పరువును తానే అడ్డంగా తీసుకొంది. తన కజిన్ పెళ్ళిలో సిగరెట్ తాగుతూ మీడియా కంట పడింది. ఇంకేముంది నెటిజన్స్ అమ్మడిని ట్రోల్స్ చేయడం మొదలుపెట్టేశారు.రెండు రోజుల క్రితం జరిగిన ఒక పెళ్ళిలో అనన్య పాల్గొంది. అది పాండే కుటుంబానికి సంబంధించిన పెళ్లి అని సమాచారం. ఒక పక్క పెళ్లి జరుగుతుంటే.. అనన్య సీక్రెట్ గా సిగరెట్ తాగుతూ కనిపించింది. ఎంతో సంప్రదాయంగా పెళ్లి జరుగుతున్న పందిరిలో ఇలా సిగరెట్ తాగడం ఏంటి అంటూ నెటిజన్లు మండిపడుతున్నారు. సెలబ్రిటీలు అన్నాకా.. సిగరెట్లు, మందు తాగడం చాలా కామన్. అందులోనూ చాలామంది హీరోయిన్లు సైతం సిగరెట్ తాగడం కూడా మీడియా కంటపడింది. అయితే సమయం, సందర్భం కూడా చూసుకోవాలి కదా.. పెళ్లి మండపంలో ఇలా చేయడం పద్దతి కాదని చెప్పుకొస్తున్నారు. ఏదిఏమైనా ఈ ఒక్క వివాదం అనన్య పరువు మొత్తం తీసేసిందనే చెప్పాలి. మరి ఈ సంఘటనపై అనన్య ఎలా స్పందిస్తుందో చూడాలి.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sri Vari Printers, D.No: 13-7-954/C1, Korlagunta, Tirupathi-517501, Chittor District (AP), And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet, Guntur (District), AP-522002. CHIEF EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939. Phone No.040-27819999. E-mail Id: editor@manamnews.com.